నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 26-6-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:255 పేజీలు:6 వెల: రూ.1/-

బ్యాటరీ తయారీ కంపెనీలో పేలుడు.. 22 మంది మృతి

న్యూఢిల్లీ, జూన్ 25 :సౌత్‌కొరియాలో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సియోల్‌లోని లిథియం బ్యాటరీ తయారీ పరిశ్రమలో పేలుడు సంభవించింది.

ఈ ఘటనలో 22 మంది చనిపోయారు. మరో తొమ్మిది మందికి గాయాలు కాగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో 18 మంది చైనాకు చెందినవారు ఉన్నారు.

కంపెనీలోని రెండవ అంతస్తులో, సిబ్బంది బ్యాటరీల పనితీరును పర్యవేక్షిస్తుండగా? పేలుడు సంభవించింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

కార్మికులు మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇక సమాచారం అందుకున్న వెంటనే దాదాపు డజనకు పైగానే ఫైర్ ఇంజన్లు రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి.

విషయం తెలుసుకున్న పరిశ్రమల శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంపై విచారణకు ఆదేశించారు.

చురక

గత కాలపు ఎమర్జెన్సీ
గాయాలను కెలికేస్తరు
అప్రకటితంగా అదే నేడు
అమలుచేస్తూ కులికేస్తరు.

ప్రజాస్వామ్య పరిరక్షణ
ప్రమాణాలు చేసేస్తరు
గుణాత్మక మార్పు లేక
గంగలోన తోసేస్తరు

-వేల్పుల నారాయణ
9440433475

ఆరోగ్య మిషన్ నిధుల విడుదల చేయండి- నడ్డాకు రేవంత్ వినతి

హైదరాబాద్, జూన్ 25 :కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) 2023-24 మూడు, నాలుగు త్రైమాసికాల నిధులు రూ.323.73 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా.. ఎన్‌హెచ్ఎంలో 2024-25 మొదటి త్రైమాసిక గ్రాంట్ రూ.231.40 కోట్లు మంజురు చేయాలని కోరారు. ఎన్‌హెచ్ఎంకు సంబంధించి కేంద్రం నుంచి రావల్సిన నిధులు ఆలస్యం కావడంతో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా.. సిబ్బందికి ఇబ్బందులు వాటాతో పాటు కేంద్రం నుంచి రావల్సిన వాటా మొత్తాన్ని 2023 అక్టోబరు నుంచి తామే విడుదల చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్‌హెచ్ఎం కింద తెలంగాణకు రావల్సిన పెండింగ్ నిధులు సత్వరమే విడుదల చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ఎంపిల ప్రమాణ స్వీకారం

ఇక తెలంగాణకు చెందిన బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం ఎంపీలు ప్రమాణ స్వీకారం చేశారు. కొందరు తెలుగు, మరికొందరు ఇంగ్లీష్ లాంగ్వేజ్‌లో ప్రమాణ స్వీకారం పూర్తి చేశారు. ఎంపీలు గడ్డం వంశీ కృష్ణ, ధర్మపురి అరవింద్, రఘునందనరావు, కొండా విశ్వేశ్వరరెడ్డి, రామసాయం రఘురాం రెడ్డి ఇంగ్లీష్‌లో, ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్ హిందీలో ప్రమాణం చేశారు. సురేష్ షెట్కర్, ఈటల రాజేందర్, డీకే అరుణ, మల్లు రవి, కుందూరు రఘువీర్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్ తెలుగులో ప్రమాణం స్వీకారం కంప్లీట్ చేశారు. ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఉర్దూలో ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రమాణం స్వీకారం అనంతరం సురేష్ షెట్కర్, రఘునందన్‌రావు, ఈటల, అసదుద్దీన్, మల్లు రవి, కుందూరు రఘువీర్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కావ్య, బలరాం నాయక్, రామసాయం రఘురాం రెడ్డి జై తెలంగాణ అని నినాదం చేశారు. బీజేపీ కీలక నేత ఈటల రాజేందర్ జై సమ్మక్క సారలమ్మ అని స్లోగన్ ఇచ్చారు. చామల కిరణ్‌కుమార్ రెడ్డి జై లక్ష్మీ నర్సింహ స్వామి అని నినాదించగా, కడియం కావ్య జై భద్రకాళి అని, బలరాం నాయక్ జై తుల్జా భవాని అని నినాదం చేశారు. అసదుద్దీన్, మల్లురవి, కావ్య, రఘురాంరెడ్డి జై భీం అని అన్నారు. ఇదిలా ఉంటే అసదుద్దీన్ ఓవైసీ ప్రమాణ స్వీకారం వివాదానికి దారి తీసింది. ప్రమాణ స్వీకారం అనంతరం ఓవైసీ జై పాలస్తీనా, అల్లాహో అక్బర్ అంటూ ప్రమాణం స్లోగన్ ఇచ్చారు. నిండు పార్లమెంట్‌లో జై పాలస్తీనా అని ఓవైసీ నినాదం ఇవ్వడంపై పలువురు మంత్రులు, బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిబంధనలు పరిశీలించి.. ఓవైసీ నినాదాన్ని రికార్డుల నుంచి తొలగించే విషయాన్ని పరిశీలిస్తానని స్పీకర్ స్థానంలో ఉన్న రాధామోహన్ సింగ్ చెప్పారు.

ఇక పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీల ప్రమాణ స్వీకారాన్ని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తిలకించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వివేక్ తెలంగాణ ఎంపీల ప్రమాణాన్ని వీక్షకుల గ్యాలరీ నుంచి చూశారు. లోక్ సభ గ్యాలరీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియాగాంధీని కలిశారు.

డ్రగ్స్ వినియోగం విష ప్రయోగం లాంటిది ..దూరంగా ఉండండి - ఉప ముఖ్యమంత్రి భట్టి పిలుపు

హైదరాబాద్, జూన్ 25 : రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ఏ స్థాయిలో అయినా నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో జలవిహార్ వద్ద డ్రగ్స్ నిర్మూలన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, డ్రగ్స్ రహిత తెలంగాణ సమాజమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మారకద్రవ్యాల రవాణాలో ఎంతటి పెద్దవారు ఉన్న ఉపేక్షించమని, ఉక్కు పాదంతో అణచివేస్తామన్నారు.

"తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా కనబడడానికి వీలులేదని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కఠిన నిర్ణయం తీసుకొని ముందుకు వెళ్తున్నాం. రాష్ట్రంలో అక్రమ రవాణా, డ్రగ్స్ నివారణకు ఎన్ని నిధులైన కేటాయిస్తాం బడ్జెట్ సమస్యనే కాదు. దేశ భవిష్యత్తుకు ఉపయోగపడే యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్సును సమూలంగా నివారించడం మనందరి బాధ్యత. తెలంగాణ పోలీస్ వ్యవస్థ చాలా బలమైనది తెలివైనది ఎంత దూరం వెళ్లి నిందితులను పట్టుకునే శక్తి సామర్థ్యాలు కలది. పోలీసులు వేసే ప్రతి అడుగు మనకోసమే అన్న భావనను పెంపొందించుకొని పోలీసు వారికి సహకరించాలి.'' అని పేర్కొన్నారు.

సంఘవిద్రోహ శక్తులు, అక్రమ పద్ధతిలో డబ్బు సంపాదించడానికి కొందరు దుర్మార్గులు అలవాటు చేసే డ్రగ్స్ ఉచ్చులో పడి యువత బంగారు భవిష్యత్తును కోల్పోవద్ద ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ప్రపంచంతో పోటీపడే విధంగా విద్యార్థులు ఎదగాలి. ఈ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తున్నదన్నారు.

''డ్రగ్స్ వినియోగం విష ప్రయోగం లాంటిది.. ఇది అత్యంత ప్రమాదకరం. కుటుంబ వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తుంది. డ్రగ్స్ సరఫరా చేస్తున్న సంఘ విద్రోహశక్తుల చేతిలో యువత జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయి. పన్నుల నుంచి వస్తున్న ప్రతి పైసను సద్వినియోగం చేస్తూ ఈ ప్రభుత్వం విద్యకు ఎక్కువ మొత్తంలో వెచ్చించి మీ బంగారు భవిష్యత్తుకు తోడ్పడుతున్నది. తాత్కాలిక వ్యసనాలకు మీరు నష్టపోతే మీ తల్లిదండ్రులతో పాటు ఈ సమాజం బాధపడుతుందన్న విషయాన్ని మర్చిపోవద్దు. విద్యార్థులు యువత మంచి సహవాసంతో నడిచి భవిష్యత్తును మార్గదర్శనం చేసుకోవాలి. ప్రశాంతంగా ఆప్యాయంగా ప్రేమగా ఉన్న కుటుంబ వ్యవస్థలో డ్రగ్స్ విష ప్రయోగం లాంటిది. భారతదేశ సమాజబలమే కుటుంబ వ్యవస్థ అలాంటి కుటుంబ వ్యవస్థకే ఇది చాలా ప్రమాదకరంగా మారింది. దేశానికి బలీయమైన మానవ వనరులను నిర్వీర్యం చేయాలని దేశ ద్రోహులు చేసే కుట్రలో అంతర్భాగమే మాదక ద్రవ్యాల రవాణా..అన్ని గ్రామాల్లో మాదకద్రవ్యాల నిరోధక కమిటీలు వేసి పోలీసులు సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకుంటే కట్టడి చేయడం పెద్ద సమస్య ఏమి కాదు." అని వ్యాఖ్యానించారు.

ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 687 దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);:: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు.

వివిధ శాఖలకు చెందిన సమస్యలతో వచ్చిన ప్రజలు చిన్నారెడ్డిని, ప్రజాభవన్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందచేశారు.

మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 687 దరఖాస్తులు అందాయి.

రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 225, హౌసింగ్ కు సంబంధించి 59 దరఖాస్తులు, పౌరసరఫరాల శాఖ కు సంబంధించి 82 , హోం శాఖకు సంబంధించి 47 దరఖాస్తులు, పంచాయతి రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కు సంబంధించి 40, ఇతర శాఖలకు సంబంధించి 234 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించడం తో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

జీహెచ్ఎంసీ ఆస్తులను డిజిటలైజేషన్ చేయాలి : మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్, జూన్ 25 : జీహెచ్ఎంసీకి సంబంధించిన ఆస్తులను డిజిటలైజేషన్ చేయాలని మేయర్ గద్వాల్ విజయల క్ష్మిఅధికారులను ఆదేశించారు. మంగళవారం మేయర్ ఛాంబర్‌లో ఎస్టేట్ అదనపు కమిషనర్‌లతో కలిసి మేయర్ సమీక్షించారు. జీహెచ్ఎంసీ ఆస్తుల ద్వారా ఆదాయ వనరులు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని మేయర్ ఆదేశాలు జారీ చేశారు.

ఆస్తులను కేటగిరిగా చేసి వాటి వివరాలు అందజేయాలని కోరారు. నెలవారీ అద్దెలు సక్రమంగా వసూలు అవుతున్నాయా లీజ్ గడువు ముగింపు అయినట్లుగా ముందస్తుగా సంకేతాలు వచ్చే విధంగా ఆన్‌లైన్‌లో సరి చేయాలన్నారు. కమ్యూనిటీ భవనాలు ఎన్ని ఉన్నాయి వాటిని దేనికి ఉపయోగిస్తున్నారో వివరాలను పూర్తి నివేదిక ఇవ్వాలని మేయర్ చెప్పారు.

మోడల్ మార్కెట్, మున్సిపల్ మార్కెట్ గదుల వివరాలు, వినియోగిస్తున్న వాటి వివరాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీకి సంబంధించిన వివిధ రకాల ఆస్తుల వివరాలన్నింటినీ సమగ్ర డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని మేయర్ తెలిపారు. లీజు వివరాలు, ఆస్తులు అన్నింటినీ సిద్ధం చేసుకొని మరోసారి జరిగే సమావేశం వరకు పూర్తి నివేదికతో హాజరు కావాలనిఅధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

పోచారం పార్టీ మారినంత మాత్రన పార్టీకి వచ్చిన నష్టమేమీ లేదు - బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్

హైదరాబాద్ జూన్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);పోచారం శ్రీనివాస్ రెడ్డి లాంటి వారు పార్టీ మారినంత మాత్రన బిఆర్ఎస్ పార్టీకి వచ్చిన నష్టమేమీ లేదని, అలాంటి వాటిని పట్టించుకోవద్దని ఆ పార్టీ అధినేత కెసిఆర్ అన్నారు. మంగళవారం ఆయన ఫామ్ హౌస్‌లో పార్టీ ఎంఎల్ఏ లు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ హయాంలో ఇలాంటివి ఎన్ని జరిగినా భయపడలేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. భవిష్యత్తులో బిఆర్ఎస్‌కు మంచి రోజులు వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంఎల్ఏ లు, ఎంఎల్ సి లు, నేతలతో తరుచూ సమావేశమవుతానన్నారు. ఈ భేటీలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, కెపి. వివేకానంద గౌడ్, మాగంటి గోపీనాథ్, మురా గోపాల్, మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్ రెడ్డి, దండె విఠల్, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, ఇతర సీనియర్ నేతలు భేటీ అయ్యారు. వారితో కలిసి కెసిఆర్ లంచ్ చేశారు.

రాగల ఐదురోజులు భారీ వర్షాలే..! హెచ్చరించిన ఐఎండీ

హైదరాబాద్, జూన్ 25 :తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉత్తర తెలంగాణతో పాటు పలు జిల్లాల్లోకి వానలు కురుస్తాయని పేర్కొంది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని తెలిపింది.

రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ.. డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జూన్ 25 : రైతు భరోసా పథకంపై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళిశాఖల అధికారులతో వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిలిపివేసిన వ్యవసాయ పథకాలు, కారణాలు తెలిపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంతో మ్యాచింగ్ ద్వారా వచ్చే పథకాలు, నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంటల బీమాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు, రాబోయే సీజన్‌కు పంటల బీమాకు సంబంధించి పిలువాల్సిన టెండర్లపై చర్చించారు.

రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల్లో ఉన్న వ్యవసాయ కళాశాలలు, ఇప్పటికీ కళాశాలలు లేని జిల్లాల వివరాలు తెలుసుకున్నారు. సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యకలాపాలపై ఆరా తీశారు. వ్యవసాయ కళాశాలలో విత్తన అభివృద్ధి తీరుపై చర్చించారు. రైతు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నామని, వ్యవసాయం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం అన్నారు. రైతు భరోసాకు సంబంధించి రైతుల అభిప్రాయం ఎలా ఉంది? ఎలా ముందుకు వెళ్తే మంచిది ? అనే విషయాలు రైతుల ద్వారా తెలుసుకుంటే మంచిదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అభిప్రాయ సేకరణ చేసి రైతులను భాగస్వాములను చేయాలని, అందులో మంత్రులు పాల్గొంటే కార్యక్రమం మరింత ప్రయోజనాత్మకంగా ఉంటుందన్నారు.

డ్రిప్ ఇరిగేషన్‌కు నిధులు నిధులు కేటాయిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా పథకాలకు ఇప్పటివరకు చేస్తున్న ఖర్చు, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రాబోయే రోజుల్లో పెరుగుతున్న బడ్జెట్‌పై సమీక్ష చేశారు. ఆయిల్ ఫామ్ సాగు, నేతన్న చేయూత, నేతన్న బీమా పథకాలు ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలపై చర్చించారు. రాష్ట్ర విభజన చేనేత కార్మికుల జీవితాల్లో వచ్చిన మార్పులపై రా తీశారు. సిరిసిల్ల కో-ఆపరేటివ్ సొసైటీ, టెక్స్‌టైల్ వ్యాపారస్తులు ప్రభుత్వం నుంచి ఏ పద్ధతిలో ప్రయోజనం పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు, ఆర్థిక శాఖ అడిషనల్ సెక్రెటరీ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి కందం- నేటికీ అందం

మేధావులు తీవ్రమ్ముగ
శోధించుచు మంచి పథము సూచన జేయన్
బాధితులకు సాయపడెద
బాధలు తొలగించి-నేటి పర్వదినమునన్
(జూన్ 26 బాధితులకు సాయపడే దినం..)

-రాధశ్రీ
సెల్:9494481210

సమసిన టీ కప్పులో తుఫాన్ - చల్లబడిన జీవన్ రెడ్డి

-ఉప ముఖ్యమంత్రి భట్టి తో చర్చలు సఫలం
-బిఆర్ ఎస్ ఎమ్మెల్యే సంజయ్ చేరికతో అలిగిన జీవన్
-పార్టీని వీడతానంటూ స్టేట్మెంట్
-రంగంలోకి దిగిన భట్టి, దుద్దిళ్ల
-శాంతించిన సీనియర్ నేత..కాంగ్రెస్ లో ఉంటానంటూ ప్రకటన

హైదరాబాద్, జూన్ 25 :తాను కాంగ్రెస్ పార్టీని వదిలే ప్రసక్తే లేదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని, సంజయ్ చేరిక విషయంలో మనస్థాపం చెందానని స్పష్టం చేశారు. తాను ఇప్పుడు ఎమ్మెల్సీగా ఉన్నానన్నారు. ఎమ్మెల్సీ గా అసెంబ్లీకి వెళ్ళే హక్కు తనకు ఉందని..తన కార్యకర్తలు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు. కాగా, బిఆర్ ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ లో చేరిక విషయం తనకు ముందు చెప్పలేదంటూ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కినుక వహించారు. అసహనంతో పార్టీని విడతానంటూ ప్రకటన కూడా చేశారు.. దీంతో అప్రమత్తమైన కాంగ్రెస్ అధిష్టానం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ను జీవన్ రెడ్డి ఇంటికి పంపింది..

ఆ ఇద్దరు నేతలు జీవన్ రెడ్డి తో చర్యలు జరిపారు.. అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ, తన అభిప్రాయాలను భట్టికి వివరించానని చెప్పారు.

కార్యకర్తల మనోభావాలను తాను వెల్లడించానని అంటూ తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నట్లు చెప్పారు..

ఇక డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.."ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సీనియర్ నాయకులు. మా అందరికీ మార్గదర్శకులు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అనుభవాన్ని ప్రభుత్వ నడపడం కోసం తప్పనిసరిగా వినియోగించుకుంటాం.కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని పది సంవత్సరాలు. కాంగ్రెస్ పార్టీ జెండాను భుజాన మోస్తూ పార్టీ భావజాలాన్ని చట్టసభల్లో వినిపించిన సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి. ఈ ప్రభుత్వం నడవడం కోసం వారి ఆలోచనలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకుంటాం. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సీనియార్టీకి ఎలాంటి భంగం కలిగించకుండా పార్టీ సముచిత ప్రాధాన్యమిస్తూ గౌరవిస్తుంది. సీనియర్ నాయకులను ఎట్టి పరిస్థితుల్లో పార్టీ వదులుకోవడానికి సిద్ధంగా లేదు. పార్టీలో ఉన్న సీనియర్ నాయకులు మనస్థాపం పడితే మేమందరం బాధపడతాం." అని వ్యాఖ్యానించారు.

మహాపట్టణాల నుంచి పల్లెలకు చేరుతున్న మాదక ద్రవ్యాలు !

(26 జూన్ 'అంతర్జాతీయ మాదకద్రవ్యాల దురలవాటు, అక్రమ రవాణ వ్యతిరేక దనం' సందర్భంగా)

చైనాలో ' ప్రథమ ఓపియమ్ యుద్ధం (ఫస్ట్ ఓపియమ్ వార్)' జరుగుతున్న వేళ 1839లో 'లిన్ గ్జీగ్జూ' నేతృత్వంలో ప్రమాదకర ఓపియమ్ అక్రమ వ్యాపారాన్ని ఛేదించిన సంఘటన తొలిసారి ప్రపంచ మానవాళి దృష్టిని ఆకర్షించింది. 17 – 26 జూన్ 1987 మధ్య వియన్నాలో నిర్వహించిన మాదకద్రవ్యాల వాడకం, అక్రమ రవాణ నిరోధక సమావేశంలో మాదకద్రవ్యాల దురలవాటుతో మిలియన్ల అమాయక ప్రజలు, ముఖ్యంగా యువతీయువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, డ్రగ్స్ వాడకాన్ని తగ్గించడానికి కఠిన చర్యలతో పాటు వాటి అక్రమ రవాణాకు తగు పటిష్ట చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. ఈ సమావేశానికి గుర్తుగా 07 డిసెంబర్ 1987న ఐరాస జనరల్ అసెంబ్లీ తీసుకున్న తీర్మానం ప్రకారం 26 జూన్ 1989 నుంచి ప్రతి ఏట 'అంతర్జాతీయ మాదకద్రవ్యాల దురలవాటు, అక్రమ రవాణ వ్యతిరేక దినం' పాటించుట ఆనవాయితీగా మారింది. ఇదే అంశం ఆధారంగా కొన్ని దేశాలు 25–31 జూన్ వరకు 'జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక వారం (నేషనల్ ఆంటీ–డ్రగ్ వీక్)' కూడా నిర్వహిస్తున్నారు. ప్రపంచాన్ని కమ్మిన విపత్తుల మబ్బుల నేపథ్యంలో వైద్య ఆరోగ్య, యువజన, పోలీస్ శాఖలు సమన్వయంతో ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల వేదికలుగా మాదక ద్రవ్యాల వినియోగం పట్ల అవగాహన, అక్రమ రవాణ నిరోధక చర్యలను ప్రచారం చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. 2007 వరల్డ్ డ్రగ్ రిపోర్ట్ వివరాల ప్రకారం ప్రతి ఏట విశ్వవ్యాప్తంగా వి 322 బిలియన్ డాలర్ల మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం జరుగుతోందని అర్థం అవుతున్నది.

అంతర్జాతీయ మాదకద్రవ్యాల సమస్య :

మాదక ద్రవ్యాల దురలవాటు అంతర్జాతీయ సమస్యగా రూపొందింది. దేశాల సరిహద్దులు దాటుతూ అక్రమ రవాణ చేసే స్మగ్లర్లు, తీవ్రవాద గుంపులు తమ అక్రమ సామ్రాజ్యాలను విస్తరించడం, సప్లై చైన్‌ను ఏర్పాటు చేసుకోవడం యద్దేచ్ఛగా జరుగుతున్నది. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దురలవాటు, అక్రమ రవాణ వ్యతిరేక దినం–2024 నినాదంగా 'స్పష్టమైన రుజువుంది : నివారణకు చర్యలు తీసుకుందాం (ది ఎవిడెన్స్ ఈజ్ క్లియర్ : ఇన్వెస్ట్ ఇన్ ప్రివెన్షన్)' అనబడే నినాదాన్ని తీసుకొని పలు ప్రచార కార్యక్రమాలను నిర్వహించుట జరుగుతున్నది. 'ఐరాస ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' వరల్డ్ రిపోర్ట్ – 2020 వివరాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 269 మిలియన్ల జనులు మాదక ద్రవ్యాలను వాడుతున్నారని, వీరిలో 35 మిలియన్లు మాదకద్రవ్యాల సంబంధ రుగ్మతలతో బాధ పడుతున్నారని తెలుస్తున్నది. కరోనా అలల వల్ల ఉద్యోగ ఉపాధులు తగ్గడంతో నిరుద్యోగ యువత నిరాశకు గురికావడంతో మాదకద్రవ్యాల వాడకం యువతలో పెరిగిందని కూడా తెలుస్తున్నది. కరోనా విజృంభనతో ఓపియమ్ కొరత ఏర్పడటంతో ప్రత్యామ్నాయంగా బెంజోడైజీపైన్, ఆల్కహాల్ లాంటి కృత్రిమ అత్యంత ప్రమాదకర డ్రగ్స్ వాడకం కూడా పెరగడం చూస్తున్నాం.

భారత్‌లో మాదకద్రవ్యాల సమస్య :

ఇండియాలో దాదాపు 14.6 కోట్ల జనులు ఆల్కహాల్ దురలవాటుకు లోనైనారని, 3.1 కోట్లు ప్రజలు కన్నాబిస్ డ్రగ్స్, దాదాపు 3 కోట్లు ఓపియం మరియు 8.5 లక్షల ప్రజలు మాదకద్రవ్యాలను సూది మందు రూపంలో (ఐవి) వాడుతున్నారని తేలింది. ఇలాంటి సూది మందులను వాడడం వల్ల హెచ్ఐవి–ఏయిడ్స్ కూడా పెరిగిపోయే ప్రమాదం ఏర్పడుతున్నది. భారతదేశంలో మాదకద్రవ్యాల కేంద్రంగా సరిహద్దు రాష్ట్రం పంజాబ్ అగ్ర భాగాన ఉన్నది. అంతర్జాతీయ సరిహద్దు రాష్ట్రాల్లో డ్రగ్స్ అక్రమ రవాణ, వాడకం ఎక్కువగా కనిపిస్తున్నది. అస్సాం, ఢిల్లీ, హర్యానా, మణిపూర్, మిజోరాం, సిక్కిం, మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ మరియు యుపీ రాష్ట్రల్లో మాదకద్రవ్యాల లభ్యత, వాడకం అధికంగా నమోదు అవుతున్నాయి. కాశ్మీర్ సరిహద్దు ప్రాంతాల్లోంచి అక్రమ రవాణాకు తోడుగా కన్నాబిస్, హెరాయిన్, కొకేయిన్ లాంటి మాదకద్రవ్యాలను ఉత్పత్తి కూడా జరుగుతున్నది. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ దేశ సరిహద్దుల గుండా డ్రగ్స్ దేశంలోకి అక్రమంగా చేరవేయడం జరుగుతున్నది.

మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు :

మాదకద్రవ్యాలు లేదా డ్రగ్స్ దురలవాటుకు గురి అయిన వారు అనేక దుష్ప్రభావాలకు లోనవుతారు. మానసిక కల్లోలం, ఆందోళన, నిరాశ, చికాకు, సుఖభ్రాంతి, అతి చురుకుదనం, అతిగా కదలడం, మానవ సంబంధాలలో అసాధారణ ప్రవర్తన, ప్రేరణ కోల్పోవడం, బాధ్యతల్ని విస్మరించడం, చట్టవ్యతిరేకంగా ప్రవర్తించడం, సత్వర అలవాట్ల మార్పు, విధులకు గైర్హాజరు కావడం, శారీరకంగా బలహీన పడడం, నిద్ర లేమి, సోమరితనం, అనవసరంగా ఆవేశ పడడం, భయం లేకపోవడం, ఉద్రేక పడడం, మానసిక ప్రవర్తనలో సమూల మార్పులు, సమాజంలో చిన్నచూపుకు గురికావడం, వ్యక్తిత్వ వినాశనం లాంటి పలు అనర్థాలు జరుగుతాయి. మాదకద్రవ్యాల దురలవాటు దుష్పరిణామాల్లో మెదడు క్రియాశీలతలో మార్పులు, అనవసరంగా గాయాల పాలుకావడం, రోగనిరోధకశక్తి పడిపోవడం, హృదయనాళ సమస్యలు, వికారం, వాంతులు, కాలేయ హాని, కడుపు నొప్పి, స్ట్రోక్స్, హార్ట్ అటాక్, నిర్ణయం శక్తి నశించడం, శాశ్వతంగా మెదడు ప్రభావితం కావడం, భావోద్వేగాల అస్థిరత్వం, వైద్య సమస్యలు, చట్ట వ్యతిరేక ముద్ర, ఆర్థిక లోటు, జైలు శిక్ష, వివాహితులైతే విడాకులకు దారి తీయడం, పిల్లల్ని తిట్టడం, గృహ హింసకు పాల్పడడం లాంటి అనేక ప్రతికూల ప్రభావాలు కలుగుతాయి.

పలు రకాల మాదకద్రవ్యాలు:

కన్నాబిస్ ఆధారిత చరస్, గంజాయి, భంగ్ లాంటి మత్తు మందులను మిలియన్ల భారతీయులు వాడుతున్నారని తేలింది. డ్రగ్స్‌లో ముఖ్యంగా స్టిమ్యులెంట్స్ (కొకేయిన్), డిప్రెసెంట్స్ (ఆల్కహాల్), ఓపియ్–ఆధార పెయిన్ కిల్లర్స్ (హెరాయిన్), హాలుసినోజన్స్ (యల్‌యస్‌డి) అనబడే నాలుగు వర్గాలు ఉన్నాయి.

కట్టడి మార్గాలు:

మాదకద్రవ్యాల దురలవాటు అత్యంత ప్రమాదకరమైందని, అంతర్జాతీయ సమాజ సమన్వయంతోనే వాటి అక్రమ రవాణ అరికట్టవచ్చనే సందేశాన్ని ఇస్తూ, డ్రగ్స్ వాడకంతో దేశ యువశక్తి నిర్వీర్యం కావడం, దేశ ఆర్థిక సామాజిక సమగ్రాభివృద్ధి కుంటుపడడం జరుగుతుంది. మాదకద్రవ్యాల దురలవాటును మాన్పించడం, ఉత్పత్తిని అరికట్టడం, డ్రగ్స్ వాడే వారికి పునరావాసంగా వైద్య సహాయం చేయడం, డ్రగ్స్ పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడం, అక్రమ రవాణాను నిలువరించడం, డ్రగ్స్ సప్లై చైన్‌ను ఛేదించి కఠిన చర్యలు తీసుకోవడం, మాదకద్రవ్యాల నిరోధ చట్టాన్ని అమలు చేయడం లాంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అంతర్జాతీయ స్థాయి నుంచి పాఠశాలల ఆవరణల వరకు విస్తరించిన మాదకద్రవ్యాల విషకోరలను పీకడానికి అంతర్జాతీయ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు పటిష్ట చర్యలు తక్షణమే తీసుకోవాలి. మాదకద్రవ్యాల అక్రమ రవాణ అరికట్టే అంతర్జాతీయ వ్యవస్థ, స్థానిక రవాణ, సరఫరాలను నియంత్రించే చర్యలు, తీరప్రాంతాలు, సరిహద్దుల్లో కఠిన కట్టుదిట్టమైన నియంత్రణ వ్యవస్థలను చేపట్టడంతోనే డ్రగ్స్ మహమ్మారిని అడ్డుకోవడం జరుగుతుందని గమనించాలి.

సినీ పరిశ్రమ, విద్యాలయాలు, మహానగరాలు, రేవ్ పార్టీలు, పబ్‌లు, బార్లు, రిసార్టులు, హోటల్స్ లాంటి ప్రదేశాలు మాదకద్రవ్యాల వాడక కేంద్రాలుగా నిలుస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో మాదకద్రవ్యాల వాడకం 30 శాతం పెరగడం గమనించారు. మాదకద్రవ్యాల దురలవాటు ప్రాణాంతకమని హెచ్చరిస్తూ, యువతను సన్మార్గంలో నడిపించాల్సిన కనీస బాధ్యత మనందరి మీద ఉందని గుర్తించాలి. దేశ యువత మత్తులో తూలకుండా, బాధ్యతాయుత పౌరులుగా జాతి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆశిద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

64వ ఐఎస్ఓ కౌన్సిల్ సమావేశాన్ని జూన్ 25 నుండి 27వ తేదీ వరకు నిర్వహించనున్న భారత్

న్యూఢిల్లీ, జూన్ 25 :భారతదేశం జూన్ 25 నుండి 27, 2024 వరకు న్యూఢిల్లీలో షుగర్ సెక్టార్ పై 'ఐఎస్ఓ కౌన్సిల్ మీటింగ్' పేరుతో ఒక గ్లోబల్ సదస్సును నిర్వహిస్తోంది. చక్కెర, జీవ ఇంధన రంగానికి సంబంధించిన క్లిష్టమైన సమస్యలపై చర్చించేందుకు 30 కంటే ఎక్కువ దేశాల నుండి ప్రతినిధులు, అనేక అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు దీనిలో పాల్గొంటున్నారు.

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుగాను, రెండవ అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారుగాను ఉన్నందున, ఐఎస్ఓ కౌన్సిల్ 2024కి భారతదేశాన్ని సంస్థ అధ్యక్ష స్థానానికి నామినేట్ చేసింది. సమావేశంలో భాగంగా, అంతర్జాతీయ ప్రతినిధుల పారిశ్రామిక పర్యటనతో భారతదేశం ఈవెంట్‌ల శ్రేణిని ప్రారంభిస్తోంది. జీవ ఇంధనాలు, ఇతర ఉప–ఉత్పత్తులలో భారతదేశం వినియోగిస్తున్న అత్యాధునిక సాంకేతికతను చూడడానికి ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో డిస్టిలరీని ప్రతినిధులు సందర్శిస్తారు.

25.06.2024న, భారత్ మండపంలో 'చక్కెర మరియు జీవ ఇంధనాలు ? ఎమర్జింగ్ విస్టాస్' పేరుతో వర్క్‌షాప్ జరుగుతుంది. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ, నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తారు.

అంతర్జాతీయ ప్రతినిధులు, భారతీయ చక్కెర మిల్లుల యాజమాన్యాలు, ఐఎస్ఎంఏ, ఎన్ఎఫ్ఎస్ఎఫ్ వంటి పరిశ్రమల సంఘాలతో పాటు సాంకేతిక నిపుణులు వర్క్‌షాప్‌లో పాల్గొంటున్నారు. ప్రపంచ చక్కెర రంగం, జీవ ఇంధనాలు, సుస్థిరత, రైతుల పాత్ర మొదలైన వాటిపై ప్రపంచ భవిష్యత్తు దృక్పథాన్ని చర్చించడానికి వివిధ సంస్థలు, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి 200 మందికి పైగా ప్రతినిధులకు ఈ ఫోరమ్ అవకాశం కల్పిస్తుందని భావిస్తున్నారు. అలయన్స్, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించే ప్రయత్నంగా ప్రపంచంలోని స్థిరమైన జీవ ఇంధనాల అభివృద్ధి, స్వీకరణను ప్రోత్సహించడానికి దేశాలను ఒకచోట చేర్చడంలో గౌరవ ప్రధాని శ్రీ నరేందర్ మోదీ చొరవతో దేశం ముందుకు వెళ్తోంది. ఐఎస్ఓ, గ్లోబల్ బయోఫ్యూయల్ అలయన్స్‌లోని అనేక సభ్య దేశాలు సాధారణ, జీవ ఇంధనాల కూటమి ప్రోత్సాహాన్ని విస్తరించడానికి ఇది మరొక వేదిక అవుతుంది.

ఇంటర్నేషనల్ షుగర్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఓ) అనేది లండన్‌లో ప్రధాన కార్యాలయాన్ని కలిగి ఉన్న యుఎన్ అనుబంధ సంస్థ. ఐఎస్ఓ లో దాదాపు 85 దేశాలు సభ్యులుగా ఉన్నాయి, ఇది ప్రపంచంలోని చక్కెర ఉత్పత్తిలో దాదాపు 90% కవర్ చేస్తుంది. చక్కెర రంగానికి సంబంధించిన సమస్యలతో పరస్పర అవగాహన, ప్రగతిశీల విధానాన్ని తీసుకురావడానికి ప్రధాన చక్కెర ఉత్పత్తి చేసే, వినియోగించే, వర్తకం చేసే దేశాలను ఏకతాటిపైకి తీసుకురావడం తప్పనిసరి. ఐఎస్ఓ జీవ ఇంధనాలపై కూడా పని చేస్తోంది, ముఖ్యంగా ఇథనాల్ కు సంబంధించి... చెరకు ప్రపంచంలో ఇథనాల్ ఉత్పత్తికి రెండవ ప్రధాన ఫీడ్‌స్టాక్.

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రతినిధుల కోసం 25.06.2024 సాయంత్రం జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు, విభిన్నమైన, గొప్ప భారతీయ సంస్కృతి సంగ్రహావలోకనం అందిస్తుంది.

ప్రధానంగా ఈ సదస్సు వివిధ క్రియాత్మక అంశాలపై దృష్టి సారిస్తుంది. ఐఎస్ఓ ఆర్థికవేత్తలు నిర్వహించిన కొన్ని అధ్యయనాల ప్రదర్శనను కూడా ఇస్తారు. ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ కార్యదర్శి శ్రీ సంజీవ్ చోప్రా, సంస్థ ఛైర్మన్ హోదాలో, 26 – 27 జూన్ 2024న సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు.

27.06.2024 సాయంత్రం న్యూఢిల్లీలోని ఎర్రకోటకు గైడెడ్ టూర్, 28.06.2024న న్యూ ఢిల్లీలోని ప్రధాన మంత్రుల మ్యూజియం, లైబ్రరీని సందర్శించడంతో కార్యక్రమం ముగుస్తుంది.

మొత్తంమీద, వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం షుగర్, బయోఫ్యూయల్ రంగానికి సంబంధించిన మేధోమథనం, చర్చ, విద్యాసంబంధ అధ్యయనాలు అలాగే ఇంటర్నేషనల్ షుగర్ ఆర్గనైజేషన్ అడ్మినిస్ట్రేటివ్ పనితీరుపై సమిష్టిగా సమాలోచనలు జరుగుతాయి. ఈ ప్రతిష్టాత్మకమైన సదస్సు ఈ రంగంలో భారతదేశ నాయకత్వానికి అద్దం పడుతోంది

అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 2025 మార్చి 31 వరకు గోధుమలపై నిల్వల పరిమితి

న్యూఢిల్లీ, జూన్ 25 :మొత్తం ఆహార భద్రతపై దృష్టి పెడుతూ కేంద్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. అక్రమంగా నిల్వలు చేయడం, విలువలు పాటించకుండా చేస్తున్న ఊహాగానాలను నిరోధించడానికి, కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తకులు/టోకు వ్యాపారులు, రిటైలర్లు, పెద్ద చైన్ రిటైలర్లు, ప్రాసెసర్‌లకు వర్తించే విధంగా గోధుమల నిల్వల పరిమితులను విధించాలని నిర్ణయించింది. లైసెన్సింగ్ అవసరాలు, స్టాక్ పరిమితులు, నిర్దేశిత ఆహార పదార్థాలపై కదలిక పరిమితుల తొలగింపు (సవరణ) ఆర్డర్, 2024 ఈ రోజు అంటే 24 జూన్ 2024 నుండి తక్షణమే అమలులోకి వచ్చేలా జారీ చేశారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇది 31 మార్చి 2025 వరకు వర్తిస్తుంది.

వర్తకులు/టోకు వ్యాపారులు–3000 ఎంటీ స్టాక్ పరిమితులు వ్యక్తిగతంగా వర్తిస్తాయి; రిటైలర్–ప్రతి రిటైల్ అవుట్‌లెట్‌లకు 10 ఎంటీ; పెద్ద చైన్ రిటైలర్– ప్రతి అవుట్‌లెట్‌కు 10 ఎంటీ, వారి అన్ని డిపోలు, ప్రాసెసర్‌ల వద్ద 3000 ఎంటీ పరిమితి కాగా నెలవారీ ఇన్‌స్టాల్ చేయబడిన కెపాసిటీ (ఎంఐసి)లో 70 శాతం 2024–25 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన నెలలతో గుణించబడుతుంది. పైన పేర్కొన్న విధంగా సంబంధిత చట్టపరమైన సంస్థలు... ఆహార, ప్రజాపంపిణీ శాఖ పోర్టల్ (https://evegoils.nic.in/wsp/loginలో స్టాక్ పొజిషన్‌ను ప్రకటించి, వాటిని క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాలి. స్టాక్ నిల్వ వారు సూచించిన పరిమితి కంటే ఎక్కువగా ఉంటే, ఈ నోటిఫికేషన్ జారీ చేసిన 30 రోజులలోపు వారు నిర్దేశించిన స్టాక్ పరిమితులకు వాటిని తీసుకురావాలి.

కుప్పం ప్రజలు నాకు ప్రత్యక్ష దేవుళ్ళు..

–మళ్లీ కుప్పం బిడ్డగానే పుడతా: చంద్రబాబు

–నలభై ఏళ్లుగా నన్ను అందరిస్తున్నారు.. మీ రుణం తీర్చుకోలేనిది..

–కుప్పం సభలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు

అమరావతి, జూన్ 25 :నలభై సంవత్సరాల నుండి కుప్పం నియోజకవర్గ ప్రజలు నన్ను సొంత బిడ్డగా అందరించారని మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేనిదని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కుప్పంలో మంగళవారం సాయంత్రం సీఎం నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశం ప్రారంభం కాగానే వర్షం మొదలైంది.

దీంతో సమావేశం కొనసాగిద్దామా కాసేపు ఆపుదామా అని సీఎం కోరగా.. కొనసాగించాలని కార్యకర్తలు కోరారు. కుప్పం దేవుళ్లను నేరుగా చూడటానికి ఇక్కడికి వచ్చాన్నారు. కుప్పంలో నా సామాజికవర్గ ప్రజలు లేరన్నారు. 40ఏళ్లుగా గెలిపిస్తున్న ఈ వెనుకబడ్డ ప్రజలే నా సామాజిక వర్గం అని తెలిపారు. మరోసారి కుప్పం బిడ్డగానే పుట్టాలని కోరుకుంటున్నానని చంద్రబాబు అన్నారు.

హంద్రీనీవా అధికారులపై సీఎం ఆగ్రహం

–ప్రజలకు వాస్తవాలు తెలియజేయండి

–కుప్పం బ్రాంచ్ కాలువ పూర్తి అయ్యినట్లు ఎలా చెప్పారు

అమరావతి, జూన్ 25 : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటన చేస్తున్న క్రమంలో మంగళవారం హంద్రీ నీవా కాలువల పరిశీలనకు చంద్రబాబు వెళ్లారు. ఈ సందర్భంగా హెచ్ ఎన్ ఎస్ ఎస్ అధికారులు కుప్పం బ్రాంచ్ కాలువ పనుల పురోగతి గురించి వివరిస్తూ.. ఇంకా చేయాల్సిన పనులను మ్యాప్ ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సదరు అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలనీ మొత్తం పనులు పూర్తి అయ్యిందని చెప్పి గత పాలకులు వేసిన డ్రామాలకు మీరు వంత పాడింది మంచి పద్ధతి కాదన్నారు. త్వరలో పనులు వేగవంతంగా జరిగేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు.

హనుమ విహారి వచ్చేయ్.. అన్ని విధాల అండగా ఉంటాం- నారా లోకేష్

అమరావతి, జూన్ 25 :సీనియర్ క్రికెటర్ హనుమ విహారీని తిరిగి ఎపికి తిరిగి రావాలసిందిగా ఆహ్వానించారు మంత్రి నారా లోకేష్.. నేడు హనువిహారి లోకేష్‌తో భేటీ అయ్యారు. ఈ విషయాన్ని నారా లోకేష్ స్వయంగా తన ట్విట్టర్ వేదిక ద్వారా తెలిపారు. ఇక బేటీ సందర్భంగా జగన్ ప్రభుత్వంలో తనకు జరిగిన అవమానాలను నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో.. ఏసీఏతో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

దీంతో.. తిరిగి ఏసీఏ తరపునే ఆడాలని హనుమ విహారి నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా క్రికెటర్ హనుమ విహారి మాట్లాడుతూ.. తన టాలెంటును గత ప్రభుత్వం తొక్కేసిందని ఆరోపించారు. ఓ వైసీపీ కార్పొరేటర్ పేరు చెప్పి తనతో బలవంతంగా రిజైన్ చేయించారని హనుమ విహారి ఆరోపించారు. ఈ క్రమంలో.. చంద్రబాబు, లోకేష్ పవన్ కళ్యాణ్ తనకు అండగా నిలబడ్డారని తెలిపారు. ఏపీకి చెందిన వ్యక్తిని అయినప్పటికీ గత పాలకులు తనను ఇబ్బందులకు గురి చేశారన్నారు. అప్పటి ఏసీఏ వ్యవహరించిన తీరుతో వేరే రాష్ట్రం నుంచి ఆడాలని భావించానని ఏసీఏ నుంచి ఎన్వోసీ తీసుకుని వేరే రాష్ట్రం తరపున ఆడేందుకు ప్రయత్నించానని చెప్పారు.

మరోవైపు ఆంధ్రాలో క్రికెట్‌ను ఎంకరేజ్ చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారని విహారి తెలిపారు. అంతేకాకుండా ఏసీఏ తరపునే ఆడాలని లోకేష్ సూచించారన్నారు. క్రీడల్లో రాజకీయాలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారని, లోకేష్ హామీతో తిరిగి ఏసీఏ తరపునే ఆడాలని నిర్ణయించుకున్నట్లు క్రికెటర్ హనుమ విహారి పేర్కొన్నారు.

శంషాబాద్‌లో చిరుతపులి కలకలం.. పట్టుకునేందుకు బోన్లతోపాటు ట్రాప్ కెమెరాలు

హైదరాబాద్, జూన్ 25 : శంషాబాద్‌లో చిరుతపులి సంచారం మరోసారి కలకలం సృష్టిస్తున్నది. గతంలో విమానాశ్రయం వద్ద ఓ చిరుతపులిని పట్టుకున్న విషయం తెలిసిందే. తాజాగా శంషాబాద్ మండలంలోని ఘాన్సిమియాగూడలో చిరుత కనిపించింది. సోమవారం అర్ధరాత్రి సీసీ టీవీలో రికార్డయిన వీడియలో కనిపించిన దానిని చిరుతగా అటవీ అధికారులు భావిస్తున్నారు. దాన్ని బంధించేందుకు మూడు బోన్లతో పాటు 10 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా, ఇటీవల అదే జంతువు కుక్కపై దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

గత నెల ఆరంభంలో శంషాబాద్ విమానాశ్రయంలో చిరుత పులి సంచరించింది. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి వద్ద ఎయిర్‌పోర్ట్ ప్రహరీ నుంచి చిరుత దూకినట్లు అధికారులు గుర్తించారు. దాంతోపాటు మరో రెండు పిల్లలు కూడా ఉన్నట్లు తెలుసుకున్నారు. విమానాశ్రయం ప్రహరీ దూకుతుండగా పెన్సింగ్ వైర్లకు చిరుత తగలింది. దీంతో ఎయిర్‌పోర్ట్ కంట్రోల్ రూంలో అలారం మోగింది. ఆ తర్వాత రెండు రోజులపాటు శ్రమించిన అటవీ అధికారులు చిరుతను పట్టుకున్నారు.

పొగాకు రహిత విద్యా సంస్థల (టిఓఎఫ్ఈఐ) పై దేశవ్యాప్త ప్రచారాన్ని ప్రారంభించిన విద్యా మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, జూన్ 25 :భారత్‌లో నివారించదగిన మరణాలు, వ్యాధులకు ప్రధానమైంది పొగాకు వాడకం ఒకటి. దేశంలో ప్రతి ఏడాది దాదాపు 1.35 మిలియన్ల మరణాలకు ఇది కారణమవుతుంది. పొగాకు వినియోగంలో ప్రపంచంలో భారత్ రెండో స్థానంలో ఉంది. గ్లోబల్ యూత్ టొబాకో సర్వే (జివైటిఎస్) 2019 ప్రకారం, దేశవ్యాప్తంగా 13 నుండి 15 సంవత్సరాల వయస్సు గల పాఠశాల విద్యార్థులలో 8.5 శాతం మంది వివిధ రూపాల్లో పొగాకును వినియోగిస్తున్నారు.

పాఠశాల భవనాలు, ప్రాంగణాల చుట్టు పక్కన ప్రాంతాల్లో వివిధ రకాల పొగాకు ఉత్పత్తులు సులభంగా లభ్యం కావడమే ఈ పరిస్థితికి దోహదపడే ప్రధాన కారకాలలో ఒకటిగా భావిస్తున్నారు.

జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం (ఎన్టిసిపి) లో భాగంగా, భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పిల్లలను, యువతను పొగాకు వాడకం నుండి రక్షించడానికి 'పొగాకు రహిత విద్యా సంస్థ (టిఓఎఫ్ఇఐ) మార్గదర్శకాల' ను జారీ చేసింది.

విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం పాఠశాలల కోసం "టిఓఎఫ్ఇఐ అమలు కరదీపిక" ను రూపొందించింది. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవమైన 31 మే 2024 న దీనిని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు టిఓఎఫ్ఇఐ మార్గదర్శకాలను పాటించేలా చేసి పొగాకు రహిత ప్రాంతాలుగా మార్చడమే దీని లక్ష్యం.

పొగాకు రహిత విద్యా సంస్థల లక్ష్యాన్ని పెంపొందించడానికి, భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం కార్యదర్శి, పాఠశాలలు, సమీప ప్రాంతాల్లో ఈ క్రింది సూచనాత్మక కార్యకలాపాలను చేపట్టడం ద్వారా టిఓఎఫ్ఇఐ అమలు కరదీపిక ప్రకారం పొగాకు రహిత విద్యా సంస్థల (టిఓఎఫ్ఇఐ) మార్గదర్శకాలను తగిన రీతిలో పాటించాలని అన్ని రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాలకు వివరణాత్మక సలహాను జారీ చేశారు;

నిర్దేశిత వ్యక్తి సమాచారంతో, విద్యా సంస్థ ఆవరణలో 'పొగాకు రహిత స్థలం' అనే సూచిక బోర్డును ఏర్పాటు చేయాలి.

నిర్దేశిత వ్యక్తి సమాచారంతో విద్యాసంస్థ యొక్క ప్రవేశ ద్వారం/సరిహద్దు గోడ వద్ద "పొగాకు రహిత విద్యాసంస్థ" అనే సూచికను ప్రదర్శించాలి.

విద్యాసంస్థల ఆవరణలో సిగరెట్/బీడీలు లేదా పారేసిన గుట్కా/పొగాకు సంచులు, ఉమ్మివేసిన మరకలు వంటి పొగాకు వాడకానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు ఉండకూడదు.

విద్యా సంస్థల ఆవరణలో పొగాకు వల్ల కలిగే నష్టాలపై పోస్టర్, ఇతర అవగాహనా అంశాలను ప్రదర్శించాలి.

విద్యా సంస్థల్లో కనీసం ప్రతి 6 నెలలకు ఒకసారి పొగాకు నియంత్రణ కార్యక్రమాన్ని నిర్వహించాలి.

'పొగాకు పర్యవేక్షకుడి' అభ్యర్థిత్వం, వారి పేర్లు, హోదా, ఫోన్ నెంబర్‌ను సూచిక బోర్డులో పేర్కొనాలి.

విద్యా సంస్థల ప్రవర్తనా నియమావళిలో "పొగాకు వాడక రహిత" మార్గదర్శకాలను చేర్చాలి.

విద్యాసంస్థ యొక్క ప్రహరీ గోడ/కంచె వెలుపలి పరిమితి నుండి 100 గజాల వైశాల్యాన్ని గుర్తించాలి.

విద్యా సంస్థకు 100 గజాల పరిధిలో ఉన్న దుకాణాల్లో ఎలాంటి పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదు. టిఓఎఫ్ఇఐ అమలు కరదీపిక అనుబంధం–ఎఎఎ ప్రకారం పొగాకు వాడకానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయాలి. వీధి నాటకాలు, వీడియో చిత్రాలు, స్వచ్ఛంద సంస్థలు, రిసోర్స్ పర్సన్లు మొదలైన వాటి ద్వారా పొగాకు వ్యసనంపై అవగాహన సందేశాలను వ్యాప్తి చేయడంలో పౌర సమాజం పాత్రను ఉద్ఘాటించారు. తదనుగుణంగా, పొగాకు నివారణ, వినియోగంపై అవగాహన కల్పించడానికి ప్రాంతాల్లో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్లు, స్వచ్ఛంద సంస్థలను పాల్గొనేలా చేసేందుకు పాఠశాల నిర్వహణ కమిటీ సమావేశాలు, ఎన్ఎస్ఎస్ విద్యాంజలి–స్కూల్ వాలంటీర్లు, వి

జనసేన ఎమ్మెల్యేలతో డిప్యూటీ సీఎం పవన్ భేటీ

–శాసనసభ వ్యవహారాలపై అవగాహన కార్యక్రమం
–సభ నియమావళిని ఎమ్మెల్యేలకు చెప్పిన పవన్
–రేపటి నుంచి వారాహి అమ్మవారి దీక్షలో పవన్ కల్యాణ్
–11 రోజుల పాటు పండ్లు, ద్రవాహారంతో దీక్ష..

అమరావతి, జూన్ 25 :విజయవాడ: జనసేన ఎమ్మెల్యేలతో ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్‌తో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. శాసనసభ వ్యవహారాలపై వారికి అవగాహన కల్పించారు. సభ నియమావళికి తెలియజేశారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 26వ తేదీ నుంచి వారాహి అమ్మవారి దీక్ష చేపట్టనున్నారు. 11 రోజులపాటు దీక్ష చేస్తారు. ఇందులో భాగంగా పాలు, పండ్లు, ద్రవాహారం తీసుకుంటారు. గత ఏడాది జూన్ మాసంలో ఆయన వారాహి విజయ యాత్ర చేపట్టారు. ఆ యాత్ర సందర్భంలోనూ వారాహి అమ్మవారికి పూజలు నిర్వహించి దీక్ష చేపట్టారు.. మళ్లీ మరోసారి ఆయన ఈ దీక్ష చేయనున్నారు.

నేటి నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వరుస భేటీలు : కేసీఆర్

హైదరాబాద్, జూన్ 25 :మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ మారడాన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద గౌడ్, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్ రెడ్డి, దండె విఠల్, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, నాయకులు క్యామ మల్లేశ్, రావుల శ్రీధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారితో కలిసి లంచ్ చేసిన కేసీఆర్.. బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. ఎవరూ తొందరపడొద్దని సూచించారు.

ఇలాంటి పరిణామాలు ఆనాటి వైఎస్ హయాంలోనే జరిగాయని.. అయినా మనం భయపడలేదని కేసీఆర్ గుర్తు చేశారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ మారడాన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని సూచించారు. కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చే నష్టం ఏమీ లేదని స్పష్టం చేశారు. రేపట్నుంచి వరుసగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతిన్నదని అన్నారు. భవిష్యత్తులో మనకు మంచి రోజులు వస్తాయని తెలిపారు.

గొలుసు ఎత్తుకెళ్లి.. గోవాలో ఎంజాయ్

–భార్య కోరిక తీర్చేందుకు.. చైన్ స్నాచింగ్

హైదరాబాద్, జూన్ 25 :భార్య కోరిన కోర్కెలను తీర్చేందుకు ఓ వ్యక్తి చైన్ స్నాచింగ్‌కు పాల్పడి.. దొంగగా మారాడు. ఓ మహిళ మెడలోంచి బంగారు పుస్తెల తాడును కొట్టేసి.. తనఖా పెట్టగా వచ్చిన నగదుతో భార్యతో కలిసి గోవా వెళ్లి ఎంజాయ్ చేశాడు. చివరకు అంబర్‌పేట పోలీసులకు పట్టుబడి జైలు పాలయ్యాడు. సోమవారం అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ గిరిధర్ ఈ వివరాలను వెల్లడించారు. ఉప్పల్‌కు చెందిన సునీత్ కుమార్(24) నగరంలోని డెక్కన్ ఈవెంట్స్ సంస్థలో ఆర్గనైజర్‌గా పని చేస్తుంటాడు. అతడికి నగరానికి చెందిన ఓ మహిళతో 9 నెలల కిందట వివాహమైంది. విలాసవంతమైన జీవనం కోసం భార్య ఒత్తిడి చేయడంతో డబ్బు కోసం దొంగగా మారాడు. ఈ నెల 19న అంబర్‌పేట డీడీ కాలనీ నివాసి, ఇండోమెంట్ శాఖలో ఎగ్జిక్యూటివ్ అధికారిగా పనిచేసి పదవీ విరమణ అయిన డి.పారిజాత ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తుండగా.. ఇదే అదునుగా భావించిన సునీత్ కుమార్ ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకొని పరారయ్యాడు.

దొంగిలించిన పుస్తెల తాడును సికింద్రాబాద్‌లో వన్‌గ్రామ్ ఆభరణాలు విక్రయించే పి.వెంకటేశ్వర్లు సాయంతో ఈసీఐఎల్‌లోని కృష్ణ జ్యువెలర్ యజమాని రాజేశ్ రాథోడ్ వద్ద రూ.65వేలకు తనఖా పెట్టాడు. తాకట్టు పెట్టగా వచ్చిన డబ్బుతో సునీత్ కుమార్ తన భార్యతో కలిసి గోవా వెళ్లి.. అక్కడ రెండు రోజులు ఎంజాయ్ చేశారు. బాధితురాలు పారిజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితుడు గోవాలో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లారు. అక్కడి నుంచి తమిళనాడు నాగపట్నం వెళ్తున్న క్రమంలో వారిని అరెస్ట్ చేసి, అంబర్‌పేటకు తరలించారు. చైన్ స్నాచింగ్ పాల్పడ్డ సునీత్ కుమార్‌తో పాటు అతడికి సహకరించిన పి.వెంకటేశ్వర్లు, రాజేశ్ రాథోడ్‌ను కూడా అరెస్టు చేసి, వీరి వద్ద నుంచి రెండు తులాల పుస్తెల తాడుతో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో కాచిగూడ ఏసీపీ వి.రఘు, అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ డి.అశోక్, అంబర్‌పేట డీఐ కె.మల్లేశ్వరి, నల్లకుంట ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కేసు ఛేదించిన అధికారులను అభినందించిన డీసీపీ వారికి నగదు రివార్డులు అందజేశారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయుతనందిస్తా : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

హైదరాబాద్, జూన్ 25 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా ఉంటూ తగిన చేయుతనందిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని హబ్సిగూడ ప్రభుత్వ పాఠశాలలో కాలేరు యమునాబాయి ట్రస్టు ఆధ్వర్యంలో కాలేరు జైనవీన్ సహకారంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రస్టు ద్వారా సేవలు అందించడం అభినందనీయమన్నారు.

పాఠశాలలో సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. మరోసారి పాఠశాలను సందర్శిస్తానని హామీనిచ్చారు. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు పసుల ప్రభాకర్‌రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు, మహేష్‌గౌడ్, కాలేరు సుధాకర్, అజిత్‌రెడ్డి, నురం శంకర్, చాంద్‌పాషా, బోసాని పవన్, అద్విత్, శ్యామ్, నాని, చందు, లక్ష్మణ్‌రావు, లక్ష్మి పాల్గొన్నారు.

రూ.58.80లక్షల విలువైన గోల్డ్ సీజ్

హైదరాబాద్, జూన్ 25 :శంషాబాద్ ఎయిర్ పోర్టులో రూ.58.8 లక్షల విలువైన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు సీజ్ చేశారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో కస్టమ్స్ అధికారులు నేడు తనిఖీలు చేపట్టారు. అబుదాబి నుంచి హైదరాబాద్ వస్తున్న ఓ ప్రయాణికుడు వద్ద ఉన్న 806 గ్రాముల బంగారాన్ని అక్రమంగా తెస్తున్నట్టు గుర్తించారు.

బంగారాన్ని పౌడర్‌గా తయారు చేసి దానిని ఉండలుగా మార్చి బ్యాగ్‌ల్లో తీసుకువ స్తున్నాడని, దీని విలువ రూ.58.8 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. బంగారాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : ఎమ్మెల్యే మల్లారెడ్డి

హైదరాబాద్, జూన్ 25 :మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికంగా ఎదగాలని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ ఎస్సీ కార్పొరేషన్, ప్రో ఫ్యాషన్ ఆధ్వర్యంలో 3 నెలల పాటు కుట్టు శిక్షణ పొందిన 70 మంది మహిళలకు మంగళవారం ఉచితంగా కుట్టుమిషన్లను మల్లారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగల్లో ముందుఉంటున్నారని తెలిపారు.

స్వశక్తితో ఎదుగుతూ విభిన్న రంగాల్లో రాణిస్తున్నారని ప్రశంసించారు. మహిళల అభ్యున్నతికి గత ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని తెలిపారు. కుట్టు శిక్షణ తీసుకున్న మహిళలు 10 మందికి శిక్షణ ఇవ్వడంతో పాటు వ్యాపార రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్,కమిషనర్ రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు, కో-అప్షన్ సభ్యులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు కావాలి : ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 25 : బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు కావాల్సి ఉందన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

చట్టం ప్రకారం డాక్టర్ సంజయ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి సభ్యత్వాలు రద్దు కావాలి. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ ఇచ్చేందుకు స్పీకర్‌ను సమయం కోరాం. వెసులుబాటు చూసుకొని సమయం ఇస్తానని స్పీకర్ చెప్పారు. స్పీకర్ న్యాయంగా సమయం ఇస్తారని ఆశిస్తున్నాం. అనర్హత పిటిషన్లపై ఈ నెల 27న హైకోర్టులో విచారణ ఉంది. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను వంచిస్తోంది. రాహుల్ కాంగ్రెస్‌ది ఒక విధానం.. రేవంత్ కాంగ్రెస్‌ది మరో విధానం. గత పదేండ్లలో ఫిరాయింపులను ప్రోత్సహించింది బీజేపీ. బీజేపీకి తోకగా తెలంగాణ పీసీసీ వ్యవహరిస్తోంది అని జగదీశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాన్సువాడ, జగిత్యాల ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలుపొందారు. వీరిద్దరిని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరిపై గులాబీ శ్రేణులు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎన్ డిఏ అభ్యర్థిగా స్పీకర్ బరిలో ఉన్న ఓమ్ బిర్లా

ఎన్ డిఏ అభ్యర్థిగా స్పీకర్ బరిలో ఉన్న ఓమ్ బిర్లా

–ప్రతపక్ష అభ్యర్థిగా పోటీపడుతున్న కొండికునాల్ సురేశ్

న్యూఢిల్లీ జూన్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: లోక్ సభ స్పీకర్ పదవికి తొలిసారి పోటీ జరుగబోతున్నది. ఇదివరలో ఈ పోస్ట్ కు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొలిసారి ప్రతపక్ష అభ్యర్థిగా కొండికునాల్ సురేశ్ పోటీపడుతున్నారు. కాగా ఎన్ డిఏ అభ్యర్థిగా ఓమ్ బిర్లా పోటీపడుతున్నారు. నామినేషన్ల ప్రక్రియ మధ్యాహ్నం 12.00 గంటలకు ముగిసింది.ప్రతిపక్ష ఇండియా బ్లాక్ తో మోడీ నేతృత్వంలోని ఎన్ డిఏ ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్ విషయంలో ఓ అంగీకారానికి రాలేకపోయింది. దాంతో స్పీకర్ పదవికి పోటీ నెలకొంది.18వ లోక్ సభ తొలి రోజు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ సహా 262 మంది కొత్తగా ఎన్నికయిన ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. కాగా మిగతా 281 మంది కొత్త ఎంపీలు నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వారిలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ ఉన్నారు.స్పీకర్ ఎన్నిక బుధవారం జరుగనున్నది. ఇదిలావుండగా ఇండియా బ్లాక్ కు చెందిన ఎంపీలు పార్లమెంటు లోపల, వెలుపల 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అన్న నినాదాలతో, రాజ్యాంగం ప్రతులను పట్టుకుని నిరసన తెలిపారు.స్పీకర్ ఎన్నిక జూన్ 26న జరుగనున్నది. కాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూన్ 27 న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రక్రియ కొనసాగనున్నది. వచ్చే వారం ఉభయ సభలలో ప్రధాని మోడీ చర్చలపై సమాధానాలు ఇవ్వనున్నారు.

ఒకరోజు వర్క్‌షాప్‌ను ప్రారంభించనున్న కేంద్ర మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్

న్యూఢిల్లీ, జూన్ 25 :మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ పరిధిలోని పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ (డీఏహెచ్‌డీ) రాబోయే 21వ పశుగణన కోసం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వ్యూహరచన, సాధికారత కల్పించే లక్ష్యంతో కీలకమైన వర్క్ షాప్‌ను నిర్వహించనుంది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లాలన్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ సహాయ మంత్రులు ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బఘేల్, శ్రీ జార్జ్ కురియన్.. డీఏహెచ్‌డీ కార్యదర్శి శ్రీమతి అల్కా ఉపాధ్యాయ కూడా పాల్గొననున్నారు.

21వ పశుగణనను సమర్థవంతంగా నిర్వహించడానికి మొబైల్ యాప్, సాఫ్ట్‌వేర్‌తో సహా అవసరమైన సాధనాలతో రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులను సన్నద్ధం చేయడం ఈ వర్క్‌షాప్ ప్రాథమిక లక్ష్యం. అధిక-నాణ్యత డేటా సేకరించేలా పాల్గొనేవారికి డేటా తయారీ వ్యూహాలపై శిక్షణ అందనుంది. వివిధ రిజిస్టర్డ్ జాతులపై ఈ వర్క్‌షాప్‌లో అవగాహన కల్పించనున్నారు.

1919 లో ప్రారంభమైనప్పటి నుంచి పశుసంవర్ధక రంగంలో విధాన రూపకల్పనకు, అనేక కార్యక్రమాల అమలుకు వెన్నెముకగా ఉంటూ, ప్రతి ఐదేళ్లకు ఒకసారి చేపట్టే పశుగణన ఒక ముఖ్యమైన ప్రక్రియ. ఈ సమగ్ర ఇంటింటి సర్వేలో దేశవ్యాప్తంగా పెంపుడు జంతువులు, పక్షులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరిస్తారు. 2024 సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు జరగనున్న 21వ పశుగణనలో డేటా సేకరణ, బదిలీ కోసం మొబైల్ టెక్నాలజీని ఉపయోగించనున్నారు. ఇది దేశంలోని అన్ని గ్రామాలు, పట్టణ వార్డుల్లో ఈ ప్రక్రియ కచ్చితత్వం, సామర్థ్యాన్ని పెంచుతుంది. వర్క్‌షాప్ ఆవిష్కరణ కార్యక్రమంతో ప్రారంభమవుతుంది. తరువాత పశు జన గణన విధానంపై వివరణాత్మక సెషన్లు దుంటాయి. మొబైల్ అప్లికేషన్, సాఫ్ట్‌వేర్ డ్యాష్‌బోర్డ్‌పై శిక్షణ ఇస్తారు. పాల్గొన్న వారి నుంచి ప్రశ్నలు, అనుమానాలను నివృత్తం చేయటానికి ఓపెన్ హౌస్ చర్చ ఉంటుంది.ఈ కార్యక్రమంలో కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ సహాయ మంత్రులు ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బఘేల్, జార్జ్ కురియన్ పాల్గొంటారు. డీఏహెచ్ డీ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ్, డీఏహెచ్‌డీ సీనియర్ అధికారులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ముఖ్య కార్యదర్శులు/కార్యదర్శులు, 21వ పశుగణనకు సంబంధించిన టెక్నికల్ కమిటీ సభ్యులు, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా పాల్గొంటారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలలో భవిష్యమెడికల్ అకాడమిప్రభంజనం

ఖమ్మం, జూన్ 25 :(నేటినిజం ప్రతినిధి): ఇంటర్మీడియట్ ఫలితాలలో ఖమ్మం నగరంలోని తమ విద్యార్థులు ఇంటర్మీడియట్ బైపిసి లో 440 మార్కులకు గాను 438మార్కులతో స్టేట్ ర్యాంకు సాధించిన యస్.కే.సనకు అకాడమీ డైరెక్టర్ బండి రామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సాధారణ విద్యార్థులతో నూటికి నూరుశాతం ఫలితాలు సాధించారని 438,436,436,435,435,133,432, 432,431,431,430 వంటి మార్కులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ బండి రామిరెడ్డి, చైర్మన్ శ్రీలత, జనరల్ మేనేజర్ వి.ఎస్.ఎస్.మూర్తి, ప్రిన్సిపాల్ సుమలత, అధ్యాపక బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్రావు, రవీంద్రారెడ్డి, కృష్ణప్రసాద్, నాగేశ్వరరావు, పి.యన్.కె, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరవధిక నిరాహార దీక్ష విరమించిన అతిషి

న్యూఢిల్లీ జూన్25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఢిల్లీ జల మంత్రి అతిషి మంగళవారం తన ఆరోగ్యం బాగా క్షీణించడంతో చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షను విరమించారని, ఆమెను ఆసుపత్రిలో చేర్పించినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. అంతేకాక ఆయన ఢిల్లీకి హర్యానా నుంచి సరైన వాటా నీళ్లను కేటాయించేలా ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాయనున్నట్టు కూడా తెలిపారు. సంజయ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలు తెలిపారు.ఢిల్లీకి నీటి సంక్షోభం తలెత్తడంతో మంత్రి అతిషి జూన్ 21 నుంచి నిరాహార దీక్ష చేపట్టారు. ఆమె ఆరోగ్యం క్షీణించడంతో మంగళవారం ఆమెను ఆసుపత్రిలో చేర్చారు. ఆమె ఢిల్లీలోని లోక్ నాయక్ హాస్పిటల్ లోని ఐసియూ ఎమర్జెన్సీ లో ఉన్నారు. ఆమె రక్తంలో చక్కెర పాళ్లు పడిపోయాయి. గత ఐదు రోజులుగా ఆమె ఎలాంటి ఆహారం తీసుకోకపోవడంతో పరిస్థితి విషమంగా మారింది. "ఆమె త్వరగా కోలుకోవాలి" అని ఆప్ ఎక్స్ లో పోస్ట్ పెట్టింది.

రైతుల సంక్షేమం కోసం కెసిఆర్ విప్లవాత్మక మార్పులు: కెటిఆర్

హైదరాబాద్ జూన్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: దేశంలో తొలసారి రైతులు కోసం రైతుబంధు అమలు చేసిన ఘనత బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కే దక్కుతుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. కెసిఆర్ ప్రభుత్వంలో రైతు మరణాలు తగ్గడంపై అరవింద్ వారియర్ అనే నెటిజన్ చేసిన ట్వీట్‌కు కెటిఆర్ స్పందించారు. రైతుల సంక్షేమం కోసం కెసిఆర్ విప్లవాత్మక పథకాలు అమలు చేశారని కొనియాడారు. 70 లక్షల మంది రైతులకు రూ.73 వేల కోట్ల రూపాలయు ఖాతాల్లో వేశామన్నారు. రైతు బీమా పేరుతో ప్రతి రైతుకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పించామని వివరించారు. 24 గంటల విద్యుత్ అందించడంతో పాటు రూ.25 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామన్నారు. మిషన్ కాకతీయలో భాగంగా వేల చెరువులను పునరుద్ధరణ చర్యలు చేపట్టామని, కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, సీతారామా లాంటి భారీ ప్రాజెక్టులను నిర్మించామని కెటిఆర్ తెలియజేశారు.

'గేట్ వేస్ టు ద సీ: హిస్టారిక్ పోర్ట్ స్ ఎండ్ డాక్స్ ఆఫ్ ముంబయి రీజన్' పుస్తకాన్ని ఆవిష్కరించిన మహారాష్ట్ర గవర్నరు

న్యూఢిల్లీ, జూన్ 25 :'గేట్ వేస్ టు ద సీ: హిస్టారిక్ పోర్ట్ స్ ఎండ్ డాక్స్ ఆఫ్ ముంబయి రీజన్' పేరు తో ఉన్న ఒక గ్రంథాన్ని మహారాష్ట్ర గవర్నరు శ్రీ రమేశ్ బైస్ 2024 జూన్ 22 వ తేదీ న (శనివారం నాడు) ముంబయి లోని రాజ్ భవన్ లో ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వ సమాచారం మరియు ప్రసార మంత్రిత్వ శాఖ కు చెందిన ప్రచురణల విభాగం ప్రచురించింది. మేరిటైం ముంబయి మ్యూజియం సొసైటి (ఎమ్ఎమ్ఎమ్ఎస్) సంకలనం చేసిన ఈ గ్రంథం లో ప్రముఖ రచయితలు వ్రాసిన పద్దెనిమిది వ్యాసాలు ఉన్నాయి.

మహారాష్ట్ర గవర్నరు శ్రీ రమేశ్ బైస్ ఈ సందర్భం గా ఎమ్ఎమ్ ఎమ్ఎస్ మరియు 17 మంది రచయి తల ను, ఇద్దరు సంపాదకుల ను సన్మానించారు. ముంబయి ప్రాచీన సముద్ర సంబంధి చరిత్ర ను గురించి తెలుసుకోండంటూ ముంబయి పౌరుల ను ప్రోత్సహించారు. ప్రచురణల విభాగం మరియు ఏశియాటిక్ సొసైటి లు కలసి రాజ్ భవన్ లోని దర్బార్ హాల్ లో ఈ పుస్తకం తాలూకు ఒక ప్రజెంటేషన్ ను ఇచ్చాయి. సభ కు తరలివచ్చిన వారి లో ఆహ్వానాలను అందుకొన్న చరిత్రకారులు మరియు చరిత్ర పట్ల ఆసక్తి ఉన్నారు.

ఎమ్ఎమ్ఎమ్ఎస్ సంకలనం చేసిన ఈ పుస్తకం లో సోపారా, వసయి, వర్సోవ, మాహిమ్, కల్యాణ్, ఠాణె, పన్ వెల్, అలీబాగ్, చౌల్, మండద్ మరియు జంజీరా ల వంటి ముంబయి లోని ప్రాంతాల యొక్క విభిన్న నౌకాశ్రయాలు మరియు రేవుల చరిత్ర ను గురించిన ఆధికారిక వ్యాసాలు ఉన్నాయి. చరిత్రకారులు, పరిశోధకులు, సముద్ర సంబంధి నిపుణులు, సంరక్షణ వాస్తుశిల్పులు మరియు రచయితలు మొత్తం పద్దెనిమిది అధ్యాయాలను అందించా రు. పైన ప్రస్తావించిన ప్రాచీన నౌకాశ్రయాలను గురించిన చైతన్యాన్ని వ్యాప్తి చేయడం లో ఈ పుస్తక ప్రచురణ ఒక ప్రముఖమైన మైలురాయి గా నిలవడం తో పాటు దీనిలో మఝ్ గాఁవ్ రేవు, ముంబయి నౌకాశ్రయం, బాంబే డాక్, ససూన్ డాక్, ఇంకా భావుచా ధక్కా అనే పేరు తో ప్రసిద్ధి ని పొందిన ఫెరీ వార్ఫ్ సహా ముంబ యి లోని ఆధునిక ఓడరేవుల మరియు రేవుల అభివృద్ధి అనే అంశాలను కూడా చేర్చడమైంది. ఈ కార్యక్రమం లో మేరిటైం ముంబయి మ్యూజియం సొసైటీ యొక్క అధ్యక్షుడు కెప్టెన్ శ్రీ కె.డి. బహల్, వైస్ ఎడ్ మిరల్ (రిటైర్ డ్) శ్రీ ఇంద్రశీల్ రావు, ఎడిటర్ డాక్టర్ శెఫాలి శాహ్ గారు, ఉపాధ్యక్షురాలు అనిత యెవాలె గారు, ప్రచురణల విభాగం యొక్క డిప్యూటీ డైరెక్టరు సంగీత గోడ్ బోలె గారు మరియు సహాయ రచయితలు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ నేరేడుమెట్‌లో దారుణం

-మైనర్ బాలికపై ఐదుగురు యువకుల గ్యాంగ్ రేప్

హైదరాబాద్ జూన్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సికింద్రాబాద్ ప్రాంతం నేరేడుమెట్ లో దారుణం వెలుగులోకి వచ్చింది. మైనర్ బాలికపై ఐదుగురు యువకుల గ్యాంగ్ రేప్ కు పాల్పడ్డా రు. మైనర్ అమ్మాయిని ట్రాప్ చేసి నేరేడు మెట్ తీసుకువెళ్లి గ్యాంగ్ రేప్ కు యువకులు పాల్పడ్డారు. కాచిగూడలో ఉంటున్న మైనర్ అమ్మాయికి యువకులు గంజాయి అలవాటు చేశారు. మైనర్ అమ్మాయి గంజాయి మత్తులోకి దిగగానే యువకులు అత్యాచారం చేశారు. జరిగిన ఘోరాన్ని తల్లికి చెప్పకుండా మైనర్ అమ్మాయి దాచిపెట్టింది. మైనర్ అమ్మాయి శరీరంలో మార్పులు రావడంతో తల్లి గమనించి నిలదీసిం ది. జరిగిన ఘోరాన్ని తల్లికి మైనర్ బాలిక వివరించింది. కాచిగూడ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి పోలీసులు నేరేడ్ మెట్ కు బదిలీ చేశారు. మైనర్ బాలికపై అత్యాచారం చేసిన యువకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలి.. కలెక్టర్



కరీంనగర్, జూన్ 25 :వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఎల్లారెడ్డి పేట వైద్యశాలను నూతన కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలకు సంబంధించిన రికార్డ్స్ ను పరిశీలించారు. దవాఖానలోని మందులు అందించే గది, రక్త పరీక్షలు చేసే ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, మందులు నిల్వ చేసే స్టోర్ రూం ను, ఆసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న అదనపు బెడ్స్ గదిని పరిశీలించారు. దవాఖానలో వైద్యులు, సిబ్బంది ఎందరు ఉన్నారని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని, జనరల్ వార్డ్ గది కిటికీలకు మస్కిటో నెట్ ఏర్పాటు చేయించాలని జనరేటర్ వినియోగంలోకి తీసుకురావాలని వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న అదనపు బెడ్స్ గది పనులను వేగంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సీహెచ్ సీ ఇంచార్జీ డాక్టర్ బాబుకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఆసుపత్రిలో సమస్యలు ఉన్నాయా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ మాట్లాడుతూ? వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇక్కడ డాక్టర్లు రఘు, ప్రదీప్, సీహెచ్ సీ ఇంఛార్జి డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

6 నెలలు గడిచినా పాలనపై పట్టు సాధించలేకపోయారు

హైదరాబాద్ జూన్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి 6 నెలలు గడిచినా పాలనపై పట్టు సాధించలేకపోయారని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ఎద్దేవా చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేవలం పరిపాలనలో పట్టు నిలుపుకోవడం కోసమే మూకుమ్మడిగా ఐఏఎస్, ఐపీఎస్ లను బదిలీలు చేస్తోందన్నారు. రేవంత్ రెడ్డి పరిపాలనను గాడిలో పెట్టేందుకు కిందామీద పడుతున్నారంటూ విమర్శలు గుప్పించారు. ఢిల్లీ పెద్దల మెప్పు పొంది, తన సీఎం పదవిని కాపాడుకోవడంపైనే రేవంత్ రెడ్డి దృష్టి పెట్టారని.. ప్రజాపాలనను గాలికొదిలేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా మంత్రివర్గ విస్తరణతో పాటు కార్పొరేషన్ల నియామకాలు చేయలేకపోవడం రేవంత్ రెడ్డి అసమర్థతకు నిదర్శనమన్నారు. మంత్రివర్గ విస్తరణ, కార్పొరేషన్ల నియామకాలు, రాజకీయ ప్రచారం కోసం, పీసీసీ అధ్యక్షుడిని ఎంపిక చేసుకునేందుకే రేవంత్ రెడ్డి ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. ఈ ప్రయత్నాల్లో భాగంగానే 11 సార్లు ఢిల్లీ వెళ్లారని, రాష్ట్రంలో పరిపాలనపై, ప్రజా సమస్యలపై మాత్రం ఎలాంటి శ్రద్ధ చూపలేదంటూ ఎన్.వి.ఎస్.ఎస్. మండిపడ్డారు. ఇక రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకొని అక్కడి నుంచే పాలన చేసుకోవాలంటూ చురకలు అంటించారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మూడు హత్యలు, ఆరు మానభంగాలుగా పాలనాతీరు మారిందని, రాష్ట్రం నేరాలతో విలయతాండవంగా మారిందని నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ప్రభుత్వ వధకాల్లో కుంభకోణాలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయని ఎన్వీఎస్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసమర్థతతో కుంభకోణాల్లో పాత్రులైన అధికారులు పలాయనం చిత్తగించారన్నారు. రాష్ట్రంలోని వేలాది ఎంఎస్ఎంఈలకు కోట్లాది రూపాయల బకాయిలను చెల్లించకుండా ఎంఎస్ఎంఈలకు సంబంధించి కొత్త విధానాలు ప్రవేశపెడుతామనడం సిగ్గుచేటని మండిపడ్డారు.

కేసీఆర్ కనుసన్నల్లోనే కాంగ్రెస్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు జరుగుతున్నాయంటూ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, కుంభకోణాల నుంచి కాపాడుకునేందుకే ఎమ్మెల్యేల ఫిరాయింపుల పర్వాన్ని నడిపిస్తున్నారంటూ ఆరోపించారు. అందులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలను కాపాడే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించి, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని అన్నారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన కాంగ్రెస్ పార్టీపై.. బిజెపి నిందలు మోపడం దుర్మార్గమని మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ పదేపదే దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా కాంగ్రెస్ తన వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు.

ప్రియురాలి కుమారుడిని గొడ్డలితో ముక్కలుగా నరికిన ప్రియుడు

అమరావతి జూన్ 25(ఎక్స్ ప్రెస్ న్యూ స్);: డబ్బుల విషయంలో గొడవ జరగడంతో ప్రియురాలి కుమారుడిని గొడ్డలితో ముక్కలుగా నరికి రెండు సంచుల్లో ప్యాక్ చేశాడు. అనంతరం రెండు సంచులను బైక్‌కు పై పెట్టుకొని గ్రామ శివారులో పడేసిన సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం?. నాగరత్నమ్మ అనే మహిళ తన భర్త 20 సంవత్సరాల క్రితం చనిపోవడంతో తన కుమారుడు మహేశ్వర్ రెడ్డి(30)తో కలిసి ఉంటుంది. భూమిరెడ్డి రామచంద్రారెడ్డి పరిచయం కావడంతో ఇద్దరు సహజీవనం చేస్తున్నారు. ముగ్గురు కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. మహేశ్వర్ రెడ్డి భారతి సిమెంట్ పరిశ్రమలో పని చేస్తుండగా రామచంద్రారెడ్డి స్వీట్స్ తయారీతో పాటు క్యాటరింగ్ చేస్తున్నాడు. ఇద్దరు మధ్య డబ్బుల విషయం గొడవలు జరుగుతున్నాయి. ఇంట్లో ఇద్దరు కలిసి మద్యం తాగారు అనంతరం డబ్బుల విషయంలో గొడవ జరిగింది. నాగరత్నమ్మ అనారోగ్య సమస్యలు ఉండడంతో మత్తు ఇంజక్షన్ వేసుకొని పడుకుంది. మరో గదిలో మహేశ్వర్ రెడ్డి పడుకున్నాడు. రామచంద్రారెడ్డి గొడ్డలి తీసుకొని మహేశ్వర్ రెడ్డి రెండు ముక్కలుగా నరికాడు అనంతరం శరీర భాగాలను రెండు సంచుల్లో మూట కట్టాడు. రెండు సంచులను బైక్‌పై పెట్టుకొని గ్రామ శివారులో పడేశాడు. అనంతరం రత్నమ్మకు టిఫిన్ ఇచ్చి బయటకు వెళ్లాడు. రత్నమ్మ ఇంట్లోకి వెళ్లి చూడగా రక్తపు మరకలు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గొడ్డలి, కత్తి, కొన్ని శరీర భాగాలను గుర్తించారు. మరికొన్ని శరీర భాగాలు కనిపించకపోవడంతో గ్రామ శివారులో వెతికారు. రామచంద్రారెడ్డి బైక్‌పై వెళ్తున్న దృశ్యాలు సిసి కెమెరాలో రికార్డు అయ్యాయి. సంచులు ఎక్కడ పడేసిన విషయం తెలియకపోవడంతో డాగ్ స్క్వాడ్ సహాయంతో చిన్నశెట్టిపల్లెరోడ్డులోని మైలవరం ఉత్తర కాలువ వద్ద శరీర భాగాలను గుర్తించారు. వెంటనే వాటిని శవ పరీక్ష నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామచంద్రారెడ్డి పరారీలో ఉండడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

40 ఏళ్ల తన సీనియారిటీకి అధిష్టానం ఇచ్చే గౌరవం ఇదేనా

-కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్సీ పదవి నాకు ఎందుకు: జీవన్ రెడ్డి

హైదరాబాద్ జూన్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: 'గత కొన్ని సంవత్సరాల నుంచి ఎవరి మీద కొట్లాడానో, వారినే నాకు ఒక్క మాట కూడా చెప్పకుండా కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడం మంచిది కాదు' అని కాంగ్రెస్ ఎంఎల్ సి జీవన్ రెడ్డి మండిపడ్డారు.

జగిత్యాల బిఆర్ఎస్ ఎంఎల్ఎ సంజయ్ కుమార్ ను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడంపై జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన భవిష్యత్తు కాలమే నిర్ణయిస్తుంది ఇప్పుడు పార్టీలో జరుగుతున్న పరిణామాలు చూసి కాంగ్రెస్ కార్యకర్తలు మనస్తాపానికి గురై బాధ పడుతున్నారన్నారు.

సోమవారం ఉదయం పత్రికల్లో చూసి జగత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేరిన వార్త తెలుసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు.

40 ఏళ్ల తన సీనియారిటీకి అధిష్టానం ఇచ్చే గౌరవం ఇదేనా ధ్వజమెత్తారు.

ఇంకా తనకు కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్సీ పదవి ఎందుకు అని ప్రశ్నించారు. శాసనసభ లో సంఖ్యా బలం పెంచుకోవడం కోసం ఏకపక్షంగా ఇతర పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నామని చెప్పడం సరికాదన్నారు.

కానీ ఆ చేరిక అనేది ఆ ప్రాంత కార్యకర్తల మనోభావాలు గౌరవించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదని హితువు పలికారు. జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి మంత్రి శ్రీధర్ బాబు బుజ్జగించారు. కాంగ్రెస్ పార్టీకి జీవన్ చేసిన సేవలు వెలకట్టలేనివని, జీవన్ రెడ్డికి న్యాయం జరిగేలా సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఇన్ ఛార్జీ దీపాదాస్ మున్షీ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పుల్లయ్యను పరామర్శించిన పరికపల్లి

- కొంత ఆర్థికసాయం అందజేత
- ప్రజాసేవలో ముందుంటా...!

ఖమ్మం, జూన్ 25 :(నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం పెద్దమునగాల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మర్రి

పుల్లయ్యని పరామర్శించి కొంత ఆర్థిక సహాయం అందించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు గ్రామ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాస్. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆధైర్యపడవద్దని అండగా ఉంటామని హామీనిచ్చి నాకు పదవి ఉన్న లేకున్నా ప్రజల్లోనే ఉంటానని మీ కష్ట సుఖాలలో పాలు పంచుకుంటానని ప్రజా సేవ చేయడం నాకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తలారి చిన్న గురవయ్య, తలారి చందు, కొప్పుల తిరుపయ్య, కొప్పుల వెంకన్న, దాసరి వెంకటి, గోపయ్య, తిరుపతి రావు, కిరణ్, తదితరులున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ దవాఖాన ఎదుట కార్మికుల ధర్నా

కరీంనగర్, జూన్ 25 : ప్రభుత్వ దవాఖానాల్లోపనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని మంగళవారం కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన ఎదుట కార్మికులు ధర్నా చేశారు. వరర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్ మాట్లాడారు. ప్రభుత్వ దవాఖానాల్లో పనిచేస్తున్న సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డు కార్మికులు రెండు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంకో వారం గడిస్తే వేతనాలు రాక మూడు నెలలు అవుతుందని తెలిపారు. పిల్లలకు స్కూల్ ఫీజులు, బుక్స్, యూనిఫామ్‌ల కోసం ఇబ్బందులు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అద్దెలు చెల్లించలేకపోతే యజమానులు ఖాళీ చేయాలని అంటున్నారని వాపోయారు. ఇతర కిరాణ సరకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురొంటున్నట్లు చెప్పారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్మికుల వేతనాలకు సంబంధించిన బడ్జెట్ 542 పడకలకు ఉంటే 332 పడకలకు మాత్రమే బిల్లు రావడం ఏంటో అర్థం కావడం లేదని, దీనికి కారకులపై చర్యలు తీసుకోవాలని, తక్షణమే కార్మికుల వేతనాల బడ్జెట్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ప్రభుత్వ దవాఖాన వరర్స్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పీ అరుణ్, ఉపాధ్యక్షులు కళావతి, యూత్ లీగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రినేత, శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్, 100 మంది కార్మికులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లు పెంచాలని రోడ్డెక్కిన వృద్ధులు.. భారీగా ట్రాఫిక్ జాం

జోగులాంబ గద్వాల, జూన్ 25 : పింఛన్ పెంచి ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఊసే ఎత్తడం లేదని పండుటాకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గద్వాల రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. రేవంత్ సర్కారు వచ్చాక నెల ముగుస్తున్నా పింఛన్ డబ్బులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.2 వేలు ఉన్న పింఛన్‌ను రూ.4 వేలు, రూ.4 వేలు ఉన్న దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలు అందిస్తామని ప్రకటించిన తర్వాత రేవంత్ సీఎం అయి ఏడు నెలలు కావస్తున్నా ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో నెలనెలా మొదటి వారంలోనే పింఛన్లు చేతికి అందేవని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ వచ్చిన కాడి నుంచి డబుల్ చేస్తామన్న పింఛన్ల సంగతి దేవుడెరుగు పాతవి కూడా సమయానికి అందించడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎలా పంపిణీ చేస్తారంటూ దౌల్తాబాద్ జడ్పీటీసీ కోట్ల మహిపాల్ వేదికపైనే ప్రశ్నించారు. ఎలాంటి పదవీ లేకున్నా వీరికి బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ధర్నాతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై విజయ భాస్కర్ ఘటనా స్థలానికి చేరుకొని వారితో మాట్లాడి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



స్టార్ మా లో వినోదాల విందు..కిరాక్ బాయ్స్ కిలాడి గాళ్స్

హైదరాబాద్ జూన్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); అమ్మాయిలు, అబ్బాయిల్లో ఎవరు గొప్ప అనే క్వశ్చన్ వచ్చిందంటే.. మేము అంటే మేము అని రెండు టీములు ముం దుకొస్తాయి. మాటా మాటా పెరిగి యుద్ధాలు మొదలవుతాయి. యుద్ధం అంటే సీరియస్ గా కాదు.. సరదాగా. సమరం అంటే ఆయుధాలతో కాదు.. మాటలతో. ఇదే కాన్సెప్ట్ తో స్టార్ మా ఒక కొత్త షో ప్రారంభిస్తోంది. షో పేరు "కిరాక్ బాయ్స్ కిలాడి గాళ్స్". ప్రముఖ డాన్స్ డైరెక్టర్ శేఖర్ మాస్టర్; బుల్లితెర, వెండితెరల్లో తనదైన ముద్ర వేసిన అనసూయ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిం చనున్నారు. తెలుగు తెలివిజన్ లో నెంబర్ వన్ వెర్సటైల్ యాంకర్ శ్రీముఖి ఈ షో ని నడిపించబోతున్నారు. చార్మింగ్ స్టార్స్ ఎందరో ఈ ఫన్నీ షో తో ''రౌటీన్ ఫార్ములా'' ని బ్రేక్ చేయబోతున్నారు. స్టార్ మా లో జూన్ 29 నుంచి రాత్రి 9 గంటలకు ప్రతి శని, ఆదివారాల్లో ప్రసారమవుతుంది. ఒకవైపు గాళ్స్ టీమ్, మరోవైపు బాయ్స్ టీమ్ పోటీలో పూర్తిస్థాయి ఎంటర్టైన్మెంట్ అందించబోతున్నారు. సరదా సరదాగా జరిగే ఈ సమరంలో ప్రేక్షకులకు కావలసినంత వినోదాల విందు అందబోతోంది. గేమ్ లో ఆట పాటలతో పాటు ఊహించని రౌండ్స్, చిత్ర విచిత్రమైన టాస్కులు, అలరించే ఛాలెంజ్ లు అన్నీ కలిసి షో ని అద్భుతంగా అందించబోతున్నాయి. బేసిక్ పోటీ అమ్మాయిలూ అబ్బాయిల మధ్యే అయినా.. ఎవరు గెలిచినా ఎవరు ఓడినా.. ఈ షో స్టార్ మా ప్రేక్షకులను మాత్రం అవుట్ అండ్ అవుట్ ఎంగేజ్ చేయడానికి సిద్ధం అవుతోంది.

ఎలాంటి పదవీ లేకున్నా కల్యాణలక్ష్మి చెక్కులు పంచిన రేవంత్ రెడ్డి సోదరుడు.. మండిపడ్డ జడ్పీటీసీ

కొడంగల్ , జూన్ 25 : రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు.. ఆయా నియోజకవర్గాల్లో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రోటోకాల్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ఇప్పుడు తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కూడా అదే పని చేశారు. తనకు ఎలాంటి పదవి లేకున్నా.. కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. రేవంత్ అన్న తిరుపతిరెడ్డికి ఎలాంటి పదవీ లేకున్నా.. కల్యాణలక్ష్మి చెక్కులు ఎలా పంపిణీ చేస్తారంటూ దౌల్తాబాద్ జడ్పీటీసీ కోట్ల మహిపాల్ వేదికపైనే ప్రశ్నించారు. ఎలాంటి పదవీ లేకున్నా కేవలం ముఖ్యమంత్రి అన్న అనే కారణంతో కల్యాణ లక్ష్మి చెక్కులు ఎలా ఇస్తారు.. ప్రోటోకాల్ ప్రకారం కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయించాలి. కేసీఆర్ ప్రభుత్వంలో వచ్చిన చెక్కులనే ఇస్తున్నారు కానీ కాంగ్రెస్ హామీ ఇచ్చిన తులం బంగారం ఇవ్వడం లేదంటూ తిరుపతి రెడ్డిపై కోట్ల మహిపాల్ మండిపడ్డారు.

నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే ప్రజల మౌలిక సమస్యలకు పరిష్కారం

- కామ్రేడ్ ఎం.వి. ప్రసాద్, వసంతక్కల 19 వ వర్ధంతి సభలో సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రబాకర్ స్పష్టం.

-ఐపిఓడబ్ల్యూ మెరుగు పుణ్యవతి అధ్యక్షతన బాలజీనగలర్ లో జరిగిన సభ

మేడ్చల్ జూన్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);దోపిడి, పీడన, అణిచివేతలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన గోదావరిలోయ విప్లవ ప్రతిఘటనోద్యమ నాయకులు కామ్రేడ్ ఎం.వి.ప్రసాద్, వసంతక్కలు పీడిత ప్రజలకు ప్రియమైన నేతలని సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ, కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రబాకర్ కొనియాడారు. మంగళ వారం మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్, వెంకటేశ్వరకాలనీలో గల మా గ్రుహలక్ష్మీ సేవా సంఘం ఆవరణలో ఎం.వి.ప్రసాద్, వసంతక్కల 19 వ వర్ధంతిని ఐపిఓడబ్ల్యూ మేడ్చల్ జిల్లా కన్వీనర్ ఎం.పుణ్యవతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సిపిఐ(ఎం .ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ జూన్-18 నుండి 25 వరకు జిల్లాల వారిగా ప్రసాదన్న, వసంతక్క ల వర్ధంతి సభలు, సమావేశాలు నిర్వహించండి అని ఇచ్చిన పిలుపులో బాగంగా జరిగిన సభలో ఎం.ప్రబా కర్ తో పాటు, భారత రైతు-కూలీ సంఘం, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నకిరేకంటి చిట్టిబాబు, భారత ప్రగ తిశీల మహిళా సంఘం (ఐపిఓడ బ్ల్యూ) జాతీయ కన్వీనర్ సంపంగి పద్మ, రాష్ట్ర కార్యదర్శి పెర్క సునీత, ఇఫ్టూ (శ్రామిక స్పందన) జాతీయ కార్యదర్శి షేక్ షావలి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.నర్సన్న, దక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ రషీద్ ద్రావిడ మరియు నేతప్ప, మైమూద్, సిద్దిరాజు, బడిగే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని ప్రసంగించారు. సభకు ప్రారంభంలో ప్రసాద్, వసంతల చిత్రపటాలకు పూలమాలలు వేసి, సంతాప సూచికంగా రెండు నిముషాలు మౌనం పాటించి, ఘనమైన విప్పవ నివాళులు అర్పించారు. అనంతరం ఆపరేష న్ కగార్ పేరుతో చత్తీస్ ఘడ్ లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆదివాసి గిరిజన ప్రజలపై అంతిమయుద్ధాన్ని వెంటనే ఆపాలని, జనశక్తి కూర రాజ న్న విప్లవోద్యమంలో చేసిన రాజకీయ హత్యలపై ఆత్మవివ ర్శ చేసుకొని, భారత విప్లవ ప్రజానీకానికి భహిరంగ క్షమాపణలు చెప్పాలని ఐపివైఎల్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బానోత్ సం తోష్ నాయక్ సభలో ప్రవేశపెట్టి, తీర్మానించారు.

స్పీకర్ ఎన్నికపై శరద్ పవార్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జూన్ 25 : లోక్‌సభ స్పీకర్ ఎన్నిక అంశంపై తాను ఎవరితోనూ చర్చలు జరపలేదని ఎన్సీపీ ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ అన్నారు. స్పీకర్ పదవికి పాలక పార్టీ సభ్యుడు ఎన్నికవడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు.

డిప్యూటీ స్పీకర్ పదవి విపక్షాలకు కేటాయించే సంప్రదాయం ఉన్నా గత పదేండ్లుగా అధిక సీట్లు గెలుచుకున్న మోదీ సర్కార్ విపక్షాలకు ఈ పదవి కేటాయించేందుకు అంగీకరించలేదని పేర్కొన్నారు.

స్పీకర్ పదవికి పోటీ లేకుండా ఏకగ్రీవ ఎన్నిక జరిగేలా పాలక పక్షం చూడాలని విపక్ష ఇండియా కూటమిలో చర్చించామని తెలిపారు.

స్పీకర్ పదవిపై ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవాలనే దానిపై తాము అంగీకరించామని చెప్పారు. తాను ఢిల్లీ వెళ్లిన తర్వాత ఈ వ్యవహారంపై ఓ స్పష్టత వస్తుందని శరద్ పవార్ తెలిపారు.

వానాకాలం పంటల సాగుపై అవగాహన కార్యక్రమం

-జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.

నంగారెడ్డి, జూన్ 25:(నేటినిజం ప్రతినిధి):అన్నదాతలకు సాగులో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం 'రైతు నేస్తం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింద ని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు.

మంగళవారం కొండాపూర్ మండల కేంద్రం లోని రైతు వేదిక భవనం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

రైతు భరోసా కార్యక్రమం ద్వారా ఆర్థిక చేయూత అందించే ఉద్దేశంతో రాష్ట్రస్థాయిలో విధి విధానాలను రూపొందిస్తున్నారు.

అందులో భాగంగా ప్రథమంగా నేరుగా క్షేత్రస్థాయిలోని రైతుల అభిప్రాయాలను సేకరించి ఏ విధంగా రైతు భరోసా కార్యక్రమం కింద ఆర్థిక చేయూతనిస్తే ఎక్కువ మంది రైతులకు లబ్ధి చేకూరుతుందో వంటి అంశాలను క్షేత్రస్థాయిలోని రైతులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడడం జరిగింది.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా నేరుగా రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలచే అవగాహన కల్పించడంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ రైతు నేస్తం కార్యక్రమం పేరు పైన ప్రతి మంగళవారం రైతు వేదికల్లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు.

వానాకాలం లో వివిధ పంటల సాగు విధానం చీడపీడల నివారణ ఎరువుల యాజమాన్యం వంటి అంశాలపై జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ శాస్త్రవేత్తలచే వివిధ యూట్యూబ్ వీడియోలను ప్రదర్శించడంతోపాటుగా రైతులతో నేరుగా చర్చించి వారి సందేహాలను నివృత్తి చేయాలనీ వ్యవసాయ అధికారుల ను ఆదేశించారు.

కొండాపూర్ రైతు వేదిక నందు నిర్వహించినటువంటి రైతు నేస్తం అవగాహన కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి అంబికా సోని, వ్యవసాయ అధికారులు గణేష్, ప్రతిభ, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

తిరుమలకు వచ్చే యాత్రికులతో స్నేహపూర్వకంగా మెదగాలి : టీటీడీ ఈవో

తిరుపతి, జూన్ 25 :ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులతో రిసెప్షన్ సిబ్బంది స్నేహపూర్వకంగా మెదగాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. మంగళవారం రిసెప్షన్ విభాగం నిర్వహాణాధికారులతో సమీక్ష నిర్వహించారు. టీటీడీ పరిధిలో ఉన్న గదులు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యం, గరిష్ట సంఖ్యలో యాత్రికుల వసతి గురించి రిసెప్షన్ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

నీడీ రీఫండ్, తిరుపతిలో అందుబాటులో ఉన్న వసతి, కొత్త పీ ఏనీలు, ఇతర సంబంధిత సమస్యలపై ఈవో ఆరా తీశారు. తరుచూ ఆలయానికి వచ్చి గదులను బుక్ చేసుకుంటున్న పురుష భక్తులకు గదుల కెటాయింపు తగ్గించాలని ఆదేశించారు. యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఐటీ విభాగం ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, రిసెప్షన్, ఐటీ వింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఏపీ టెట్-2024 ఫలితాలు విడుదల.. అర్హత సాధించని వారికి మళ్లీ టెట్ : మంత్రి నారా లోకేష్

అమరావతి, జూన్ 25 :ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన టెట్-2024 పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెట్‌లో అర్హత సాధించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. టెట్ పరీక్షలో 58.4 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

ఫిబ్రవరి 27 నుంచి మార్చి 6 వరకు నిర్వహించిన టెట్‌కు 2,35,907 మంది పరీక్ష రాయగా , లక్షా 37,904 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. టెట్‌లో అర్హత సాధించని వారికి మరోసారి టెట్ నిర్వహిస్తామని, కొత్తగా బీఎడ్, డీఎడ్ పూర్తయిన వారికి కొత్త టెట్‌లో అవకాశాలు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. మెగా డీఎస్సీకి అందరూ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.టెట్ అర్హత, 20 శాతం వెయిటేజ్ ఉండడంతో అతృతగా ఎదురుచూశారని తెలిపారు. . కొత్తగా బీఎడ, డీఎడ పూర్తి చేసుకున్న వారికి త్వరలోనే మళ్లీ టెట్‌ను నిర్వహిస్తామని వివరించారు. టెట్ ఫలితాల తరువాత మెగా డీఎస్సీ ప్రకటిస్తామని తెలిపారు.

ఏడు నెలల కావస్తుందని, ఇప్పటి వరకు పింఛన్లు చెల్లించకపోవడం అత్యంత విచారకరం- మందకృష్ణ మాదిగ

ఖైరతాబాద్, జూన్ 25 : దివ్యాగులను మోసగించిన చరిత్ర ఈ దేశంలోనే లేదని, ఆ ఘనత ఈ కాంగ్రెస్ సర్కారుకే దక్కుతుందని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగఅన్నారు. ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి సంయుక్త ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వృద్ధులు, వింతంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల పింఛన్లపై రేవంత్‌సర్కారు అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయా వర్గాలకు పింఛన్లు ఇవ్వడంతో పాటు వాటిని పెంచి వారికి ఆసరా అందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలల కావస్తుందని, ఇప్పటి వరకు పింఛన్లు చెల్లించకపోవడం అత్యంత విచారకరమన్నారు. సొంతంగా పనులు చేసుకోలేని దివ్యాంగులను సైతం విస్మరించారని, మానవత్వం లేని వారు మాత్రమే వారి విస్మరిస్తారన్నారు. రేవంత్ రెడ్డి సర్కారుకు మానవత్వం లేదని ఆరోపించారు.చేయూత పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరిని చిన్న చూపుచూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో చేయూత పింఛన్లు ఒకటని, ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెల నుంచి చేయూత పింఛన్లు ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం ఆయా లబ్దిదారులకు ఒకటి నుంచి పదో తేదీలోపు పింఛన్లు చెల్లించేవారని గుర్తు చేశారు.

ఈ ఏడు నెలల కాలంలో నెలకు రూ.896 కోట్ల చొప్పున సుమారు రూ.6,300 కోట్లు చేయూత పించన్లు అందాల్సి ఉందని, పెంచుతామని చెప్పి ఆ పింఛన్లు ఎక్కడికిపోతున్నాయని ప్రశ్నించారు. ఆయా వర్గాలకు ప్రభుత్వం బకాయి పడిందని, ఒకటో తేదీ ఉంచి 5వ తేదీలోపు చెల్లించాల్సిందేనని, పాత బకాయిలన్నీ జూలై 1 నుంచి 2వ తేదీలోపు ఇవ్వాలని, చేయూత పింఛన్లు ఎగ్గొడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రేవంత్ సర్కారుతో తాడో పేడో తేల్చుకుంటామన్నారు.

జై పలస్తీన్' అని ప్రమాణస్వీకారం ముగించిన అసదుద్దీన్ ఓవైసీ

న్యూఢిల్లీ జూన్ : 18వ లోక్ సభ రెండో రోజు సమావేశంలో మజ్లీస్ పార్టీ నాయకుడు అసదుద్దీన్ ఓవైసీ ప్రమాణస్వీకారం చేశారు. కాగా ఆయన తన ప్రమాణస్వీకారాన్ని 'జై పలస్తీన్' అంటూ ముగించడంతో సభలో గోల చోటుచేసుకుంది. నేడు ప్రమాణస్వీకారం చేసిన ప్రముఖులలో ఆదిత్య యాదవ్, డింపుల్ యాదవ్, హేమ మాలిని, అరుణ్ గోవిల్, బిప్లవ్ కుమార్ దేబ్, రాహుల్ గాంధీ తదితర ప్రముఖులున్నారు.

మాలమహానాడు ఖమ్మంనగర నూతననిర్మాణ కమిటీ ఎన్నిక

ఖమ్మం, జూన్ 25 :(నేటినిజం ప్రతినిధి): మాల మహానాడు ఖమ్మం జిల్లా గౌరవ సలహాదారులైన ప్రముఖ అడ్వకేట్ పల్ల రాజశేఖర్, మాల మహానాడు సీనియర్ నాయకుడు గుంతేటి వీరభద్రం, లింగాల రవికుమార్ ల అధ్యక్షతలో మాల మహనాడు ఖమ్మం నగర నిర్మాణ కమిటీ మంగళవారం నాడు ఖమ్మం నగరంలో గల భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న అవార్డు గ్రహీత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం నందు సమావేశ ఏర్పాటు చేసి ఖమ్మం నగర కమిటీ వేయడం జరిగింది. ఈ కమిటీకి అధ్యక్షుడిగా తురక నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కొప్పుల లక్ష్మీ నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా పేరం మల్లయ్య, ప్రచార కార్యదర్శిగా దారా రాము, ట్రెజరర్ గా నామ యేసు రత్నం, ఉపాధ్యక్షురాలు గా జక్కం స్వాతి, బండ్ల జ్యోతి, తలారి రాధాకృష్ణలతో పాటు మొత్తం ఎనిమిది మందిని ఉపాధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది. కార్యదర్శులు గా కొప్పుల రాము, కందుల చిన్నప్ప లతోపాటు ఎనిమిది మందిని సహాయ కార్యదర్శి లుగా ఎన్ను కోవటం జరిగింది. ఈ సమావేశానికి 10 డివిజన్ల నుండి దాదాపు 60 మంది హాజరైనారు.

మాల మహానాడు నగర కమిటీ 21 మందితో నగర నిర్మాణ కమిటీ వేయడం జరిగింది. అనంతరం ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం సేవ రత్న అవార్డు గ్రహీత మోటపోతుల బాబురావుకి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొట్టే సుధాకర్, గుమ్మడి కనకరాజు లతోపాటు జిల్లా కోశాధికారి ఎజ్జు ఎలియా, వర్కింగ్ ప్రెసిడెంట్ కామా ప్రభాకర్, దామల్ల వెంకటేశ్వర్లు, ఎర్ర గంగాధర్, జిల్లా ప్రచార కార్యదర్శి జమ్మి వీరబాబు, కోరివి భాస్కర్, కొప్పుల రామారావు, స్టీరింగ్ కమిటీ సభ్యులు కొరివి దయానంద్, చింత మాల సుందర్రావు, కర్నే రాము లు, మెట్టు నాగేశ్వరరావు, కరాటే వేణు లతోపాటు అనేక మంది పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు అలెర్ట్.. కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు..!

హైదరాబాద్, జూన్ 25 :రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో బీటెక్, బీఈ సీట్ల భర్తీకి కోసం నిర్వహించనున్న కౌన్సెలింగ్‌లో మార్పులు చోటు చేసుకున్నది. షెడ్యూల్ ప్రకారం.. ఈ నెల 27 నుంచి మొదలు కావాల్సిన కౌన్సెలింగ్ వాయిదాపడింది. మళ్లీ జూలై 4 నుంచి ఇంజినీరింగ్ తొలివిడత ప్రక్రియ మొదలవనున్నది. జూలై 6 నుంచి 13 వరకు తొలి విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్, 8వ తేదీ నుంచి 15 వరకు తొలి విడత వెబ్ ఆప్షన్స్, 19న ఇంజినీరింగ్ తొలి విడత సీట్లను కేటాయించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.ఇక జూలై 26 నుంచి ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని.. 27న రెండో విడత కౌన్సెలింగ్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. జూలై 27, 28 తేదీల్లో రెండో విడత వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం ఇస్తామని.. 31న రెండో విడత సీట్ల కేటాయింపు, ఆగస్ట్ 8 నుంచి మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్ట్ 9న మూడో విడత కౌన్సెలింగ్‌కు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించి.. 9, 10 తేదీల్లో వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే నెల 13న ఇంజినీరింగ్ మూడో విడత సీట్ల కేటాయించనున్నారు. ఇక ఆగస్టు 21 నుంచి కన్వీనర్ కోటా ఇంటర్నల్ స్లైడింగ్ ఉండనున్నది.

ఉన్నతాశయమే లక్ష్యంగా ఉండాలి: టి పోపా

హైదరాబాద్ జూన్ 25(ఎక్స్ ప్రెస్ న్యూ స్);విద్యా జ్యోతి ని ప్రజ్వలన తో నే సమాజం లో నెలకొన్న పేదరికం సమూలంగా నిర్మూలించవచ్చు అని తెలంగాణ పద్మశాలి అఫీషియల్స్, ప్రొఫషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గండూరి వేంకటేశ్వర్లు స్పష్టం చేశారు.సోమవారం నాడు రాష్ట్రం లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చేనేత పెద విద్యార్థులకు నారాయణ గూడ పద్మశాలి భవన్ వేదిక గా టి పోపా తరఫున ఆర్థిక సాయం అందజేశారు.

ఈ సందర్భంగా గండూరి వేంకటేశ్వర్లు 75000 రూపాయల విలువ చేసే చెక్ లను విద్యార్థుల కు అందజేశారు.

తదనంతరం ''గండూరి'' మాట్లాడుతూ..చేనేత వృత్తి తో పాటు ఉన్నత విద్య లో కూడా పద్మశాలి ల ప్రతిభ ప్రకాశించాలని ఆశించారు.చదువు కు పేదరికం అడ్డు కావద్దు అన్న ఉద్దేశ్యం తో నే .విద్యా జ్యోతి గా అండగా నిలుస్తామని చెప్పారు. టి పోపా సహా ధ్యక్షులు శిరందాస్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేతన్న లు ఉన్నత విద్య లో కూడా పోటీ పడి ఉన్నత స్థాయి ఉద్యోగాలను కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు , టిపోపా రాష్ట్ర ప్రచార కార్యదర్శి మాచన రఘునందన్ మాట్లాడుతూ..కృషి,పట్టుదల,తపన ఈ మూడింటిని కలిపి అటు సివిల్స్,ఇటు గ్రూప్స్ లో ఏవైనా సాధించి "మనం ఏంటో" చూపించే శక్తి యుక్తి యువత లో మెండు గా ఉన్నాయని సహాయాన్ని ప్రణాళికా బద్ధంగా సద్వినియోగం చేసుకుని అసాధ్యాన్ని సుసాధ్యం చేయాలని,అది ఉన్నత ఆశయం లక్ష్యంగా ఉంటేనే సాధ్యం అని చెప్పారు.

ఐఆర్‌సీటీసీ పర్సనల్ ఐడీ నుంచి ఎవరికైనా టికెట్ బుక్ చేసుకోవచ్చు.. క్లారిటీ ఇచ్చిన రైల్వేశాఖ..!

హైదరాబాద్, జూన్ 25 : ఐఆర్‌సీటీసీ వ్యక్తిగత అకౌంట్ నుంచి బంధువులు, ఫ్రెండ్‌కి ఆన్‌లైన్‌లో రైలు టికెట్లు బుక్ చేస్తే భారీ జరిమానాతో పాటు జైలుశిక్ష పడే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్నది. గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై రైల్వేశాఖ క్లారిటీ ఇచ్చింది. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని వెల్లడించింది. వార్తలు తప్పదోప పట్టించేలా ఉన్నాయని పేర్కొంది. ఐఆర్‌సీటీసీ వ్యక్తిగత యూజర్ ఐడీ సహాయంతో కుటుంబీకులు, బంధువులు, ఫ్రెండ్స్ ఎవరికైనా ఈ-టికెట్లను బుక్ చేసుకోవాలరి క్లారిటీ ఇచ్చింది. అయితే, ఒక ఐడీతో నెలకు కనీసం 12 టికెట్లు పొందవచ్చని.. ఆధార్ అనుసంధానం చేసిన యూజర్లు నెలలో 24 టికెట్లు బుక్ చేసుకోవచ్చని చెప్పింది.పర్సనల్ ఐడీతో బుక్ చేసిన ఈ టికెట్స్ వాణిజ్యపరమైన అవసరాల కోసం మాత్రం కాదని చెప్పింది. అయితే, నిబంధనలు ఉల్లంఘిస్తే రైల్వేచట్టం 1989లోని సెక్షన్ 143 ప్రకారం నేరమని రైల్వేశాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. రైల్వేబోర్డు మార్గదర్శకాలకు అనుగుణంగా ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో టికెట్స్ బుకింగ్ జరుగుతాయని.. ఈ మార్గదర్శకాలకు సంబంధించి పబ్లిక్ డొమైన్‌లో సమాచారం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. యూజర్లు వ్యక్తిగత యూజర్ అకౌంట్ నుంచి స్నేహితులు, కుటుంబీకులు, బంధువులకు సైతం టికెట్లను బుక్ చేసుకోవచ్చని వివరించారు.

ఆటో, బైక్ ఢీ.. నలుగురికి తీవ్రగాయాలు..

వరంగల్, జూన్ 25 : ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పూసుర్ బ్రిడ్జిపై జరిగింది. ఏటూర్ నాగారం నుండి వెంకటాపురం వెళుతున్న ఆటోను పూసూరు బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనం వెనుక నుండి ఢీ కొట్టింది.

ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికీ ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికీ తీవ్రంగా గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తులను 108 సహాయంతో ఏటూరు నాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజా ఫిర్యాదుల కోసం ప్రత్యేక పెట్టెలు : ఏపీ మంత్రి అనిత

అమరావతి, జూన్ 25 : ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు నియోజకవర్గంలో ప్రత్యేక ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేస్తున్నానని ఏపీ హోంమంత్రి వంగలపుడి అనిత పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించేలా ప్రతి మండల కేంద్రంలోని ఎమ్మార్వో, ఎంపీడీవో, కళాశాలలు, ప్రధాన కూడళ్లలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటుచేస్తానని వెల్లడించారు.

నాపేరు చెప్పి పేదలకు ఇళ్లు, పెన్షన్లు, ప్రభుత్వ పథకాలు అందిస్తానని డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులను మచ్చిక చేసుకుని అక్రమ లేఅవుట్లు, పేదల భూముల కబ్జాలాంటి ఘటనలకు పాల్పడితే సహించేదిలేదని స్పష్టం చేశారు.

ప్రభుత్వ నియమ, నిబంధనాల ప్రకారమే కేటాయింపులు చేయాలని, అందుకు విరుద్ధంగా ప్రవర్తించే అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఫిర్యాదుల పెట్టెను ప్రతి మూడు, ఐదురోజులకొకసారి తీసి వాటిని పరిశీలించి అధికారులకు పంపి పరిష్కరిస్తానని తెలిపారు.

కూసుమంచి క్లస్టర్ లో చేపడుతున్న సర్వేని క్షేత్రస్థాయిలో తనిఖీ

– అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం, జూన్ 25 :(నేటినిజం ప్రతినిధి): జిల్లాలో గత సంవత్సరంలో పంటలు వేయని

భూములకు సంబంధించి ప్రస్తుత పరిస్థితులు తెలుసుకోవడాని కి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ అప్లికేషన్ యాప్ ద్వారా క్షేత్ర స్థాయి సర్వేను మంగళవారం నుండి ప్రారంభించినట్లు అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మలతో కలిసి కూసుమంచి మండల కేంద్రం, కూసుమంచి క్లస్టర్ లో చేపడుతున్న సర్వేని క్షేత్రస్థాయి లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వ్యవసాయ భూముల సర్వేను వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి సంస్థకు చెందిన అధికారులచే చేపట్టి ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తామని అన్నారు. జిల్లాలో ఎంపిక చేయబడిన సర్వే నెంబర్లతో ఇట్టి సర్వే ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయ్ చందర్, కూసుమంచి మండల వ్యవసాయ అధికారిణి వాణి, అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

నగదు రెట్టింపు చేస్తామని మోసగిస్తున్న ముఠా అరెస్ట్.. భారీగా నగదు స్వాధీనం

హైదరాబాద్, జూన్ 25 :నగదును రెట్టింపు చేస్తామని మోసం చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా చందనపల్లి గ్రామంలో ఈ నెల 22న ఆర్ఎంపీ వైద్యుడు శ్రీరామోజు రామాచారిని ముఠా సభ్యులు కలిశారు. మీ దగ్గర ఉన్న నగదు రెట్టింపు చేస్తామని నమ్మించారు. కాగా, బీహార్ రాష్ట్రానికి చెందిన రామ్ నరేష్ యాదవ్ గతంలో చందనపల్లి గ్రామంలో తాపీ మేస్త్రీగా పని చేసినాడు. ఆ సమయంలో చందనపల్లి గ్రామానికి చెందిన శ్రీ రామోజు రామాచారి ఇల్లును కట్టడంతో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. దీంతో వారి మాటలు నమ్మాడు.

రామాచారి వద్ద నుంచి రూ.33లక్షలు తీసుకొని ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నల్లగొండ రైల్వే స్టేషన్‌లో నిన్న బీహార్‌కు చెందిన నిందితులు సిరాజ్, నరేష్ యాదవ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.24 లక్షలు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం. పరారీలో ఉన్న మరో నిందితుడు ఆఫ్తాబ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చాకచక్యంగా నిందితులను పట్టుకున్న పోలీసులను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

బంధన్ మ్యూచువల్ ఫండ్..

–బంధన్ నిఫ్టీ టోటల్ మార్కెట్ ఇండెక్స్ ఫండ్ ప్రారంభం

Bandhan Mutual Fund
Badhte Raho

హైదరాబాద్, జూన్ 25 :బంధన్ మ్యూచువల్ ఫండ్ బంధన్ నిఫ్టీ టోటల్ మార్కెట్ ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది టోటల్ మార్కెట్ ఇండెక్స్‌ను ట్రాక్ చేసే ఓపెన్ ఎండ్ ఇండెక్స్ స్కీమ్. భారతీయ ఈక్విటీ మార్కెట్‌లో 95 శాతం ప్రాతినిధ్యం వహిస్తున్న లార్జ్, మిడ్, స్మాల్, మైక్రో క్యాప్స్‌లో 750 స్టాక్‌లను కలిగి ఉన్న విభిన్నమైన పోర్ట్‌ఫోలియోలో పెట్టుబడి పెట్టే అవకాశాన్ని ఈ ఫండ్ పెట్టుబడిదారులకు కల్పిస్తుంది. కొత్త ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ) సోమవారం, 24 జూన్ 2024న తెరవబడుతుంది. శుక్రవారం, 5 జూలై 2024న ముగుస్తుంది. బంధన్ నిఫ్టీ టోటల్ మార్కెట్ ఇండెక్స్ ఫండ్‌లో పెట్టుబడిని లైసెన్స్ పొందిన మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, నేరుగా http లో చేయవచ్చు //bandhanmutual.com/nfo/bandhan-nifty-total-market-index-fund/.

ఈ సందర్భంగా బంధన్ ఏఎంసీ సీఈవో విశాల్ కపూర్ మాట్లాడుతూ టోటల్ మార్కెట్ ఫండ్ కాన్సెప్ట్ సరళత, విస్తృత కవరేజీకి ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ ఉందని తెలిపారు. ప్రపంచంలోని కొన్ని అతిపెద్ద ఈటీఎఫ్ లు ఉన్నాయన్నారు. ఇప్పుడు టోటల్ మార్కెట్ ఫండ్స్, నిఫ్టీ టోటల్ మార్కెట్ ఇండెక్స్ ఒక సంవత్సరంలో 3.77 వర్సెస్ 0.88 మెరుగైన రిస్క్-సర్దుబాటు రాబడితో నిఫ్టీ 50ని గణనీయంగా అధిగమించిందన్నారు. 3, 5, 10 సంవత్సరాలలో ఇదే విధమైన ఔట్ పెర్ఫార్మెన్స్‌ని సాధించిందన్నారు. బంధన్ నిఫ్టీ టోటల్ మార్కెట్ ఇండెక్స్ ఫండ్ అన్ని రంగాలు, మార్కెట్ క్యాప్‌లలో సమగ్ర మార్కెట్ భాగస్వామ్యాన్ని అందిస్తుందని తెలిపారు. భారతదేశ ఆర్థిక విజయం నుంచి ప్రయోజనం పొందాలని చూస్తున్న పెట్టుబడిదారులకు ఇది మంచి ఫండ్ అన్నారు. ఇది ఏదైనా ఒక విభాగంలో అవకాశాలను కోల్పోయే ప్రమాదాన్ని తగ్గిస్తుందని, అన్ని విభాగాలను కవర్ చేస్తుందని తెలిపారు

దారుణం.. చిరుత దాడిలో మహిళ మృతి

అమరావతి, జూన్ 25 : ఏపీ లోని ప్రకాశం, నంద్యాల జిల్లా సరిహద్దులో దారుణం చోటు చేసుకుంది. మంగళవారం పచ్చర్ల గ్రామానికి చెందిన మొహరున్నీసా అనే మహిళ కట్టెల కోసం నంద్యాల,గిద్దలూరు రోడ్డుపై అడవిలోకి వెళ్తుండగా అక్కడే మాటు వేసిన చిరుతపులి మహిళపై దాడిచేసి చంపివేసింది. ఆమె వెంట వెళ్లిన మరికొందరు భయంతో గ్రామానికి చేరుకుని సమాచారం చేరవేశారు. దీంతో గ్రామస్థులు అటు పోలీసులకు, ఇటు అటవిశాఖాధికారులకు సమాచారం అందించారు.

ఘటనా స్థలానికి వెళ్లిన అధికారులకు రోడ్డు పక్కనే మహిళ మృతదేహం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. చిరుత దాడితో పరిసర గ్రామాల ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

హైదరాబాద్ మెట్రో ఆదాయం డబుల్..

హైదరాబాద్, జూన్ 25 :ప్రజల నుంచి విశేష స్పందన రావడంతో హైదరాబాద్ మెట్రో ఆదాయం భారీగా పెరుగుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మెట్రో రైలు కంపెనీ ఆదాయాన్ని అధికారులు ఇటీవల వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 1407.81 కోట్ల ఆదాయం వచ్చిందని ఎల్అండ్‌టీ అధికారులు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం 2022-23లో రూ.703.20 కోట్ల ఆదాయం వచ్చిందని స్పష్టం చేశారు. అంటే గతేడాదితో పోలిస్తే ఆదాయం రెండింతలు పెరిగి 105 శాతం ఆదాయం పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

టిక్కెట్ల విక్రయం ద్వారా కంపెనీ రూ.611.48 కోట్లు ఆర్జించింది. రవాణా ఆధారిత అభివృద్ధి (టాఆ) ద్వారా రూ.796.33 కోట్ల ఆదాయం వచ్చింది. మాల్స్, ఆఫీసు అద్దెలు, టెలికాం టవర్లు, అడ్వర్టైజ్‌మెంట్ల ద్వారా 284.60 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రభుత్వం లీజుకు తీసుకున్న భూమిని మెట్రోకు స్లంప్ సేల్ రూపంలో బ్రూక్‌ఫీల్డ్ కార్పొరేషన్, రహేజా గ్రూప్‌లకు బదిలీ చేయడం ద్వారా మొదటి దశలో రూ.511.73 కోట్ల ఆదాయం వచ్చింది.

అయితే, గతేడాదితో పోలిస్తే ఆదాయం పెరిగినా.. ఓవరాల్ గా మెట్రో సంస్థ నష్టాల్లోనే ఉంది. మెట్రో ప్రారంభమైనప్పటి నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.5979.36 కోట్ల నష్టం వాటిల్లిందని ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు ప్రకటించారు.

ధ్వజావరోహణంతో ముగిసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి, జూన్ 25 : తిరుపతి లోని అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి ముగిసాయి. పదిరోజుల పాటు వైభవంగా కొనసాగిన ఉత్సవాల్లో స్వామివారు ప్రతిరోజు వాహనంపై ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

చివరి రోజు మంగళవారం స్నపన తిరుమంజనం చేపట్టి పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం నవసంధి, మాడవీధి ఉత్సవాన్ని, ధ్వజావరోహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

ధ్వజావరోహణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిసాయి. కార్యక్రమంలో ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, కంకణ బట్టర్ సూర్య కుమార్ ఆచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్ పాల్గొన్నారు.

'రేపు అందరూ సభకు హాజరుకావాలి'..

పార్టీ ఎంపీలకు విప్ జారీచేసిన కాంగ్రెస్..!

హైదరాబాద్, జూన్ 25 : పార్టీ ఎంపీలు ఎవరూ రేపు గైర్హాజరు కావద్దని అందరూ కచ్చితంగా లోక్‌సభకు రావాలని కాంగ్రెస్ పార్టీ విప్ జారీచేసింది. రేపు ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమై నప్పటి నుంచి సాయంత్రం సభ వాయిదా పడేవరకు సభ్యులందరూ అందుబాటులో ఉండాలని ఆ మూడు లైన్‌ల విప్‌లో పేర్కొంది. కాగా, రేపు లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరగనుంది. సాధారణంగా అయితే అధికార కూటమికి చెందిన ఎంపీని ఏకగ్రీవంగా లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నుకుంటారు. అయితే ఈసారి ప్రతిపక్ష ఇండియా కూటమి సీనియర్ సభ్యుడు కె సురేష్‌ను పోటీకి దింపింది. దాంతో దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రేపు స్పీకర్ ఎన్నిక కోసం ఓటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ విప్ జారీచేసింది. ఓటింగ్ సందర్భంగా సభ్యులందరూ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ ఆదేశాలు ఇచ్చింది. రేపు ఉదయం 11 గంటలకు స్పీకర్ ఎన్నిక నిర్వహించనున్నారు. అధికార కూటమి మాజీ స్పీకర్ ఓం బిర్లానే మళ్లీ బరిలో దింపింది. సభలో అధికార కూటమికి 293, ప్రతిపక్ష కూటమికి 233 మంది సభ్యుల బలం ఉంది.

యువతలో నైపుణ్యం లక్ష్యంగానోయిడాలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభం

హైదరాబాద్, జూన్ 25 :నోయిడా స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎన్ఎస్ఈజెడ్) సహకారంతో క్యాప్‌జెమినీ, ఉత్తరప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా ఇంటిగ్రేటెడ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ స్కిల్లింగ్‌ను ప్రారంభించారు. అత్యాధునిక సెంటర్‌లో తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, కౌన్సెలింగ్, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు కోడింగ్, టింకరింగ్, రోబోటిక్స్ సౌకర్యాలతో కూడిన సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్ (ఎస్టీఈఎం) ల్యాబ్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థులకు అనుకూల అభ్యాస వాతావరణాన్ని సృష్టించడం దీని లక్ష్యం. ఇది నిరుద్యోగులు, బలహీన యువకులను చేరుకోవడం ద్వారా భారతదేశంలో నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహించడంలో సహాయపడటం, జెనరేటివ్ ఏఐ, రోబోటిక్స్, ఫిన్‌టెక్ వంటి కొత్త సాంకేతికతలలో అధునాతన శిక్షణను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్ సర్వీసెస్ (ఐటీఈఎస్), ఫిన్‌టెక్ సెక్టార్‌లలో ఉపాధిని పెంపొందించడం ద్వారా సంవత్సరానికి వెయ్య మంది యువ ఔత్సాహికులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతికతలలో క్యూరేటెడ్ స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సులను క్యాప్‌జెమినీ అందిస్తుంది. పదకొండు సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయస్సు గల వ్యక్తులు ఉంటారు. సామాజికంగా, ఆర్థికంగా అట్టడుగున ఉన్న కమ్యూనిటీలు ప్రత్యేక అవసరాలు ఉన్న మహిళలు, యువకులపై ప్రత్యేక దృష్టి సారించి, డిజిటల్ చేరికను ప్రోత్సహించే లక్ష్యంతో ఉంటుంది. ఈ సందర్భంగా క్యాప్‌జెమినీ సీఈవో అశ్విన్ యార్లి మాట్లాడుతూ క్యాప్‌జెమినీ విప్లవాత్మక సామర్థ్యాలు, సాంకేతికత కలిగి ఉందన్నారు. భారతదేశ ఉపాధిని కోరుకునే యువతరాలలో అపారమైన సామర్థ్యాన్ని మనం చూస్తున్నామన్నారు. బాధ్యతాయుతమైన సాంకేతిక సంస్థగా, అట్టడుగు వర్గాలకు చెందిన యువకులను సరైన డిజిటల్ నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం, కెరీర్ అవకాశాలను పెంచడం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం లక్ష్యమన్నారు. దేశం డిజిటల్ ఇన్‌క్లూజన్ విజన్‌తో అనుసంధానించబడిధని తెలిపారు. సాంకేతిక ద్వారా రూపొందించబడిన కొత్త ప్రపంచంలో అవకాశాలను స్వీకరించడానికి భారతదేశ యువకులను సిద్ధం చేస్తుందన్నారు. ఈ కేంద్రం 360 డిగ్రీల విధానాన్ని అవలంబిస్తుందన్నారు. కెరీర్ ప్రయాణంలో వ్యక్తులకు మార్గనిర్దేశం చేస్తుందన్నారు. ఇది క్యాప్‌జెమిని సర్టిఫికేషన్, మెరుగైన ఎక్స్‌పోజర్ కోసం లైవ్ ఇండస్ట్రీ ప్రాజెక్ట్‌లతో మరింత అనుబంధించబడిందని తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులను ప్రముఖ రిక్రూటర్‌లతో ఉంచడం, ఆకాంక్షాత్మక ఉద్యోగాలలో స్థిరమైన కెరీర్‌లను ప్రారంభించడం కేంద్రం లక్ష్యమన్నారు. ఇది వ్యవస్థాపకత మద్దతు కోసం ఒక వేదికగా కూడా పనిచేస్తుందని తెలిపారు. విద్యార్థులు, యువత ఆలోచనలు, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందని తెలిపారు.

అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు జాతీయ స్థాయి కరాటే పోటీలలో బంగారు పతకాలు

కరీంనగర్, జూన్ 25 : (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ స్ కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ పాఠశాలకు చెందిన 2 విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే మరియు కుంగ్స్ చాంపియన్షిప్ పోటీలలో బంగారు పతకాలు సాధించడంపట్ల ఏర్పాటు చేసినటువంటి సమావేశానికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలలో ఎన్నో విషయాలు నేర్చుకునేవి ఉంటాయని ప్రత్యేకంగా విజయాలను సాధించే విధానాలను తెలుసుకుంటామని చెప్పారు. క్రీడల ద్వారా కలిగే విశిష్ట లాభాలవలన పాఠశాల విద్యా ప్రణాళికలో భాగంగా విద్యార్థులను వివిధ పోటలకు ఎంపిక చేయడమే కాకుండా అందులో విజయాన్ని సునాయాసంగా అందుకోవడానికై ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని చెప్పారు. ప్రాథమికంగా విద్యార్థులకు పాఠశాలలో ఎంపిక పరీక్ష నిర్వహిస్తామని అందులో ప్రతిభను కనబరచిన వారికి పోటీలకు ఎంపిక చేస్తామని వారు చెప్పారు. ఇటీవల కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించినటువంటి తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే, కుంగ్ ఫు చాంపియన్షిప్ పోటీలలో అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన ఎ.రితిక, 5వ తరగతి, అండర్ 12, కటా విభాగంలో బంగారు పతకం మరియు వెపన్ విభాగంలో రజత పతకం సాధించినదని చెప్పారు. అదేవిధంగా ఎ. సిరిసహస్ర, 8వ తరగతి, అండర్ 14 బాలికల విభాగంలో, వెపన్ విభాగంలో కాంస్య పతకం, అలాగే కటా విభాగంలో బంగారు పతకం సాధించడం కరీంనగర్ జిల్లాకే గర్వకారణమని, అలాగే ఇతర క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తి అని చెప్పారు. బంగారు పతకాలు సాధించడంపట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ విజేతలకు పుష్పగుచ్చాలతో పాటు ప్రశంస పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పాల్గొన్నారు.

హెల్ టాటా మణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాత ఆశ్రమంలో అన్నదానం

రంగా రెడ్డి జూన్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్);హెల్ టాటా మణి చారిటబుల్ ట్రస్ట్ న్యూఢిల్లీ ఫౌండర్ చైర్మన్ లయన్ డాక్టర్ కాకుమాను జ్యోతి ఆధ్వర్యం లో మంగళవారం బహదూర్ పల్లి లోని మాత ఆశ్రమం లో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాత ఆశ్రమంతరఫునవృద్ధులు వారికిధన్యవాదాలుతిలిపారు.

సిరిసిల్లలో మరో నేతకార్మికుడు బలవన్మరణం

రాజన్న సిరిసిల్ల, జూన్ 25 :(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్లలో నేతన్నల ఆకలిచావులు పెరుగుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేండ్లుగా ఏ బాధా లేకుండా బతికిన కుటుంబాలు, కాంగ్రెస్ సర్కారు ఆరు నెలల పాలనలోనే వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయి ఉపాధి కరువై, బతుకు బరువై చితికిపోతున్నాయి. నాలుగు రోజుల కిందే సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కుడిక్యాల నాగారాజు(47) ఉపాధి లేక యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువకముందే, తాజాగా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ (టెక్స్‌టైల్ పార్క్)కు చెందిన వైపని కార్మికుడు ముదిగొండ నరేష్(35) ఇంట్లోనే ఉరేసుకోవడంతోకార్మిక క్షేత్రంలో విషాదం నెలకొన్నది.

వివరాల్లోకి వెళితే.. ఇందిరమ్మకాలనీకి చెందిన ముదిగొండ శాంతవ్వ, ఈశ్వరయ్య దంపతుల కొడుకు నరేష్(35) వస్త్ర పరిశ్రమలో వైవని కార్మికుడు (బీములు నింపడం,పోగులు వేయడం) పని చేస్తున్నాడు. నరేశ్‌కు 2018లో స్వాతితో వివాహమైంది. మొదటి సంతానం కొడుకు జన్మించగా, ప్రసవ సమయంలో ఉమ్మనీరు మింగడంతో మృతి చెందాడు. స్వాతి రెండోసారి గర్భందాల్చినా కొన్నికారణాలతో కడుపులోనే శిశువు మృతి చెందింది. ఇక తల్లి శాంతవ్వ పక్షవాతంతో మంచం పట్టగా, తండ్రి ఈశ్వరయ్య వృద్ధాప్యంతో ఇంట్లోనే అచేతన స్థితిలో ఉన్నాడు. ఇన్నాళ్లూ వీరి అలనాపాలన నరేష్-స్వాతిలే చూసుకుంటున్నారు.

స్వాతి బీడీలు చుడుతూ భర్తకు చేదోడు వాదోడుగా ఉన్నది. అయితే ఆరు నెలలుగా నరేష్‌కు పనిలేక ఖాళీగా ఉంటున్నాడు. కుటుంబం గడువని పరిస్థితి నెలకొనడం, కుటుంబ సభ్యుల వైద్యానికి తెచ్చిన అప్పులు పేరుకుపోవడంతో అవస్థలు పడుతున్నాడు. ఈ క్రమంలో మనోవేదనతో సోమవారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోనే ఉరేసుకున్నాడు. తెల్లవారుజామున గమనించిన కుటుంబసభ్యులు బోరున విలపించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com